# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
11-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 201

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## కాంగ్రెస్‌కు 'కాక్రోచ్'



# తలనొప్పి!

ఆప్ మాదిరిగా నష్టం తప్పదు అన్న భయం

వారితో వేదిక పంచుకునేందుకు ఇష్టపడని హస్తం

ఏఐసీసీ పెద్దల వ్యూహం అదే

జాతీయస్థాయిలో బిజెపిని పడగొట్టాలన్న ఆశయంతో పని చేస్తున్న రాజకీయ పార్టీల మధ్య విభేదాలు కొనసాగుతూ వస్తున్నాయి. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంతో కొత్తగా పుట్టుకొచ్చిన జనతా కాక్రోచ్ గట్టిగానే తలపడుతుండడం విశేషం. బిజెపికి వ్యతిరేకంగా వెళ్లే క్రమంలో వారి మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా కనిపిస్తోంది.

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన పిలుపు ఉద్రిక్తతలకు కారణం అవుతోంది. ఓటర్ల జాబితాల సవరణలు అవకతవకలు జరిగాయి అంటూ యువత, విద్యార్థి సంఘాలతో కలిసి సిజెపి తలపెట్టిన ఈ ఆందోళనను అణచివేసేందుకు కేంద్ర హోం శాఖ, ఢిల్లీ పోలీసులు

మిగతా 2లో

# ఖైరతాబాద్‌లో మహిళలకే ఛాన్స్!

### చింతల రామచంద్రారెడ్డిని పక్కన పెట్టనున్న బిజెపి

ఫైర్ బ్రాండ్ మాధవి లత వైపు మొగ్గు

ఇంకోవైపు పీజేఆర్ కుమార్తె విజయా రెడ్డి పేరు

అనూహ్యంగా తెరపై నటి జీవిత





**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** ఖైరతాబాద్ లో బలమైన అభ్యర్థి కోసం బిజెపి అన్వేషిస్తోందా? ఈసారి చింతల రామచంద్రారెడ్డికి సీటు డౌటేనా? పరిశీలనలో

- మిగతా 3వ పేజీలో



## బెంగాల్లో కాలం చెల్లిన దీదీ రాజకీయం!

పార్టీ గుర్తును కోల్పోయి ప్రమాదంలో మమతా బెనర్జీ

ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం

పని చేయని చరిష్మ

మిగతా 2లో

# హైదరాబాదు నుంచి మూడు బుల్లెట్ ట్రైన్లు!

### బెంగళూరు, చెన్నై, ముంబైకి..

అలైన్మెంట్ తో పాటు భూసేకరణ అంశంపై కసరత్తు

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో కిషన్ రెడ్డి కీలక చర్చలు




మిగతా 2లో



# 'చే'జారుతున్న మైనారిటీలు!

కాంగ్రెస్ పార్టీకి దూరంగా ముస్లింలు

హిందూ ఓట్ల కోసం వ్యూహాత్మకంగా హస్తం

ద్వంద్వ వైఖరితో దూరం జరుగుతున్న మైనారిటీలు

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** దశాబ్దాల పాటు ఈ దేశాన్ని ఏలింది కాంగ్రెస్ పార్టీ. కొన్ని ప్రత్యేక వర్గాలు అండగా నిలవడంతోనే ఇది సాధ్యమైంది. అందులో ప్రధానమైనది ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకు. కానీ ఇప్పుడు ఆ వర్గాలు సైతం కాంగ్రెస్ పార్టీకి దూరంగా జరుగుతున్నాయి. హస్తదళంలో సంక్షోభాన్ని తెచ్చి పెడుతున్నాయి.

మిగతా 2లో

# చిన్న శ్రీను ఆన్ డ్యూటీ!

అరకు పార్లమెంట్ స్థానానికి పరిశీలకుడిగా నియామకం

అక్కడ పార్టీ గెలుపు కోసం వ్యూహాలు అందించే బాధ్యత

విజయనగరం జడ్పీ పీఠం ఆయన కుమార్తెకే?



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** టిడిపిలో చేరిన అనతి కాలంలోనే చిన్న శ్రీనుకు పార్టీ హై కమాండ్ గుర్తింపు ఇచ్చింది. కీలకమైన అరకు పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యతలు కట్టబెట్టింది. పరిశీల కుడిగా నియమించింది. వాస్తవానికి మొన్నటి ఎన్నికల్లో అరకు పార్లమెంటు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఆ పార్లమెంటు స్థానం పరిధిలోని అరకు, పాడేరులో సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలిచింది. అయితే వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది తెలుగుదేశం. అందుకే అక్కడ పార్టీ బాధ్యతలను చిన్న శ్రీనుకు అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ పార్లమెంట్ సీటు పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గాలు ఎక్కువగా ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోనివి.

మిగతా 3లో

# విద్యుత్ సంక్షోభం!



వెంటాడుతున్న కొరత

తగ్గట్టు జరగని సరఫరా

ఆపై ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.5420 కోట్ల బాదుడు

రేవంత్ సర్కార్ మల్లగుల్లాలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణకు కరెంట్ కష్టాలు కొనసాగుతున్నాయి. ఓవైపు విద్యుత్ కొరత వెంటాడుతోంది. మరోవైపు అదనపు బిల్లుల భారం పడుతుంది. ఏకంగా ట్రూ ఆప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.5420 కోట్ల భారం పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రోజుకు 1982 మెగావాట్ల విద్యుత్ డిమాండ్

మిగతా 3లో



# టీవీకే గెలిచింది!

రెండు ద్రవిడ పార్టీలు కలిస్తే కష్టమే

డీఎంకే, అన్నా డీఎంకే చీల్చిన ఓట్లతో గట్టెక్కిన విజయ్

సంపూర్ణ ప్రజామోదం పొందలేని వైనం

# అగ్రిగోల్డ్ చెల్లింపులు!

బాండ్ల పరిశీలన ప్రారంభం ..తొలుత ఎన్టీఆర్ జిల్లాలో..

త్వరలో మిగతా జిల్లాల్లో సైతం.. బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో**



అగ్రిగోల్డ్ ఖాతాదారులకు గుడ్ న్యూస్. ఏళ్ల తరబడి న్యాయం కోసం నిరీక్షిస్తున్న వారికి ప్రభుత్వం చెల్లింపులు ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డిపాజిటర్లకు న్యాయం చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం కార్యాచరణను ప్రారంభించింది.

అందులో భాగంగా మంత్రుల ప్రత్యేక బృందం తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బాండ్ల పరిశీలనకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# బెంగాల్లో కాలం చెల్లిన దీదీ రాజకీయం!

(మొదటి పేజీ తరువాయి)



**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** బెంగాల్ రాజకీయాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చలాయిస్తూ వచ్చారు మమతా బెనర్జీ. దాదాపు దశాబ్దన్నర కాలం తన కనుసైగలతో బెంగాల్ రాజకీయాన్ని శాసించారు. అటువంటి ఆమె ఇప్పుడు రాజకీయంగా సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. పెద్ద రాజకీయ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తృణమూల్ కాంగ్రెస్ పేరును, జంట పువ్వులు- గడ్డి గుర్తు స్తంభింపజేయడం మమతా శిబిరానికి చావు దెబ్బగా మారింది. మమత అంటేనే తృణమూల్.. తృణమూల్ అంటేనే మమత అన్న నినాదంతో ఎన్నాళ్లు ఏకఛత్రాధిపత్యం సాగించారు దీదీ. గుర్తింపు కోల్పోయిన స్థితిలో జరిగిన తాజా నందిగ్రామ్, రెజీనగర్ బై పోల్ లో కనీసం ప్రభావం చూపలేక చేతులెత్తేసారు.

**గట్టెక్కని కాంగ్రెస్..**

నందిగ్రామ్ లో కనీస ప్రభావం చూపలేకపోయారు మమత. 2021 ఎన్నికల్లో సువేందూ అధికారి చేతిలో ఎదురైన చేదు పరాభవం తర్వాత.. అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన నందిగ్రామ్ లో మమతా తీసుకున్న నిర్ణయం ఆమె వర్గానికి తీరని పరాభవాన్ని మిగిల్చింది. పార్టీ గుర్తు లేకపోవడంతో వ్యూహాత్మకంగా కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్ కు మమతా బహిరంగ మద్దతు ప్రకటించారు. కానీ బిజెపి అభ్యర్థి హాసి రాణి రథ్ ఏకంగా 1.64 లక్షలకు పైగా ఓట్లు సాధించారు. 1.22 లక్షల భారీ మెజారిటీతో తిరుగులేని విజయం సాధించారు. మమత ఆశీస్సులు ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి కేవలం 41 వేల ఓట్లకు మాత్రమే పరిమితమయ్యారు. మమత మద్దతుతో కొంతవరకు గట్టెక్కవచ్చు అని భావించిన కాంగ్రెస్ కు ఘోర పరాభవం ఎదురయింది.

**ఆదరించని ముస్లింలు..**

ముర్షిదాబాద్ జిల్లాలోని ముస్లిం మెజారిటీ నియోజకవర్గం రేజీ నగర్ లో పరిస్థితి మరింత దిగజారింది. ఇక్కడ మమతా బెనర్జీ వర్గం స్వతంత్ర అభ్యర్థిగా తమ ప్రతినిధిని బరిలో దింపింది. కానీ పట్టుమని ఐదు ఆరువేల ఓట్లు కూడా సాధించలేక డిపాజిట్లు గల్లంతయ్యాయి. గతంలో మమత కు ఒడగా నిలిచిన సంప్రదాయ మైనారిటీ ఓటు బ్యాంకు.. ఆమె వెనుక కాకుండా స్థానిక ప్రత్యామ్నాయాల వైపు పూర్తిగా మళ్లీ పోవడం.. బెంగాల్ రాజకీయాల్లో వస్తున్న గుణాత్మక మార్పునకు నిదర్శనం. బిజెపి రెండు స్థానాలను క్లీన్ స్వీప్ చేయడమే కాకుండా.. మైనారిటీ ప్రాబల్య ప్రాంతాల్లోనూ మమత ప్రభంజనం సున్నాగా మారింది. దీంతో బెంగాల్లో మమతా బెనర్జీ రాజకీయానికి కాలం చెల్లినట్టే.

# చిన్న శ్రీను ఆన్ డ్యూటీ!

అందుకే చిన్న శ్రీనుకు బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా ఏకపక్షంగా విజయం సాధించాలన్నది చంద్రబాబు వ్యూహం. పార్టీలో చేరిన నెల రోజులకే చిన్న శ్రీనుకు ఈ కీలక బాధ్యతలు ఇవ్వడం వెనుక నూటికి నూరు శాతం విజయం సాధించాలన్న వ్యూహం ఉంది. మరో వైపు తమ నేతకు తక్కువ కాలంలోనే కీలక బాధ్యతలు కట్టబెట్టడంపై చిన్న శ్రీను అభిమానులు ఆనందంతో ఉన్నారు.

**వైసీపీ అక్కడ స్ట్రాంగ్..**

మొన్నటి ఎన్నికల్లో అరకు పార్లమెంటు స్థానం నుంచి వైసీపీ అభ్యర్థి డాక్టర్ తనుజారాణి విజయం సాధించారు. అరకు పార్లమెంటు స్థానం పరిధిలో అరకు, పాడేరు, పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ఇందులో ఐదు స్థానాల్లో కూటమి గెలిచింది. రెండు స్థానాల్లో గెలిచిన వైసిపి పార్లమెంట్ సీటును సైతం కైవసం చేసుకుంది. తద్వారా వైసిపికి ఇక్కడ ఉన్న పట్టు తెలుస్తోంది. అందుకే ఈ నియోజకవర్గ పరిశీలకుడిగా చిన్న శ్రీనుకు బాధ్యతలు అప్పగించింది టిడిపి హై కమాండ్. దాదాపు ఈ నియోజకవర్గాలతో చిన్న శ్రీనుకు మంచి సంబంధాలు ఉన్నాయి. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించేందుకు వీలుగా చిన్న శ్రీను నియామకం జరిగినట్లు టిడిపి వర్గాలు భావిస్తున్నాయి.

**టిడిపిలో ఆశ్చర్యం..**

మరోవైపు పార్టీలో చేరిన నెల రోజులకే చిన్న శ్రీను నియామకం టిడిపి వర్గాల్లో కూడా ఆశ్చర్యపరుస్తోంది. ఒక ఒప్పందం ప్రకారమే చిన్న శ్రీను టిడిపిలో చేరినట్లు ప్రచారం నడుస్తోంది. మరో రెండు రోజుల్లో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ రానుంది. విజయనగరం కార్పొరేషన్ స్థానాన్ని జనసేన ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జిల్లా పరిషత్తు చైర్మన్ పదవి టిడిపికి ఉండిపోతుంది. అయితే జడ్పీ చైర్ పర్సన్ గా తన కుమార్తెను రంగంలోకి దించాలని చిన్న శ్రీను భావించారు. ఆ ఆలోచనతోనే ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పి టిడిపిలో చేరారు. అయితే ముందుగా మున్సిపల్ ఎన్నికల్లో.. అరకు పార్లమెంట్ స్థానం పరిధిలో టిడిపిని గెలిపిస్తే అనే షరతుతోనే చిన్న శ్రీనుకు అక్కడ బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. మరి అందులో ఆయన ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# కాంగ్రెస్‌కు 'కాక్రోచ్'

# తలనొప్పి!



(మొదటి పేజీ తరువాయి)

అసాధారణ రీతిలో భద్రత ఆంక్షలు విధించారు. జంతర్ మంతర్ పరిసరాల్లో నాలుగు కిలోమీటర్ల మేర మొబైల్ ఇంటర్నెట్ సేవలను 24 గంటలపాటు నిలిపివేశారు. సెక్షన్ 163 విధించారు. సరిహద్దుల్లో రైళ్లు, వాహనాల రాకపోకలను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి ఎవరూ చేరకుండా దేశవ్యాప్తంగా వేలాదిమందిని ముందస్తుగా నిర్బంధించారు. సాధారణ రాజకీయ పక్షాల కంటే ఈ సోషల్ మీడియా యూత్ ఆధారిత కాక్రోచ్ ఆందోళనపై కేంద్ర ప్రభుత్వం ఆందోళనకు గురవుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

**గత కొద్ది రోజులుగా ఆందోళన..**

జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి గత కొద్ది రోజులుగా రాజధాని ఢిల్లీలో హడావిడి చేస్తున్నాయి. అయితే లక్ష్యం ఒకటే కానీ కాక్రోచ్ పార్టీతో వేదిక పంచుకునేందుకు కానీ.. వారితో ప్రత్యక్షంగా కలిసి పోరాడేందుకు కానీ కాంగ్రెస్ నాయకత్వం సాహసించడం లేదు. పైకి చూస్తే అది రాజకీయ రహిత నిరసన. అందులో మేం కలిస్తే రాజకీయ రంగు పులుముకుంటుందని ఇరువర్గాలు చెబుతున్నాయి. కానీ అసలు కథ వేరే ఉందనేది ఢిల్లీ వర్గాల మాట. వ్యవస్థాపక నిర్మాణం, దశాబ్దాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని పక్కకు పెట్టి.. ఈ యువతరం ఉద్యమకారులు మైలేజ్ కొట్టేస్తారేమోనన్న అంతర్గత అభద్రతాభావం హస్తము దళంలో ఉంది.

**ఆ భయం అధికం..**

జనతా కాక్రోచ్ పార్టీతో కలిసి ఉమ్మడిగా నిరసనకు దిగితే.. మీడియాతో పాటు సోషల్ మీడియా దృష్టి మొత్తం సహజంగానే కాక్రోచ్ నేతల వైపు మల్లుతుంది. అదే జరిగితే కాంగ్రెస్ పార్టీ ఉనికి మరింత ప్రమాదంలో పడినట్టే. ప్రతిపక్ష గళాన్ని సోషల్ మీడియా యువత హైజాక్ చేస్తారన్న ఆందోళన ఏఐసీసీ వ్యూహకర్తల్లో ఉంది. గతంలో అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం ఉద్యమాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకొచ్చింది. కాంగ్రెస్ పార్టీ స్థానాన్ని భర్తీ చేసింది. ఢిల్లీతోపాటు పంజాబ్ లాంటి చోట్ల కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. అందుకే ఇప్పుడు ఎన్నికల కమిషన్ పై పోరాటంలో ప్రధాన క్రెడిట్ కాంగ్రెస్ పార్టీకే దక్కాలి తప్ప.. జనతా కాక్రోచ్ కు దక్కకూడదు అనేది కాంగ్రెస్ పెద్దల వ్యూహం. అయితే బిజెపికి వ్యతిరేకంగా పుట్టుకొచ్చిన జనతా కాక్రోచ్.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని సైతం ఇబ్బంది పెడుతోంది. ఈ రెండు పార్టీల వ్యూహం అంతిమంగా బిజెపికి కలిసి వచ్చేలా ఉంది.

# ఎల్‌నినో ప్రభావంపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని, దీన్ని అధిగమించేందుకు వెంటనే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు ప్రవేశించే వరకు సాగు, తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సీనియర్ అధికారులతో ఎల్‌నినో ప్రభావంపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. నీటిని, విద్యుత్‌ను చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్లో విద్యుత్ అందుబాటులో లేదని, అందువల్ల విద్యుత్‌పై ఆధారపడిన పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఒక్క నీటిబొట్టు కూడా వృథా కాకుండా చూడాలని స్పష్టం చేశారు.

# హైదరాబాదు నుంచి మూడు బుల్లెట్ ట్రైన్లు!

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్స్ విషయంలో కేంద్ర రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గత ఏడాది కేంద్ర బడ్జెట్లో కీలక ప్రకటన చేసింది. అందుకు సంబంధించి ఇప్పుడు కార్యాచరణ మొదలెట్టింది. బుల్లెట్ ట్రైన్స్ రూట్ లకు సంబంధించి అలైన్మెంట్ తో పాటు భూ సేకరణ అంశంపై కూడా ప్రభుత్వం కసరత్తు కొనసాగుతోంది. ప్రతిపాదిత రూట్, భూ సేకరణ వ్యయంతో పాటు రైల్వే శాఖ తీసుకోవాల్సిన నిర్ణయాల పైన తాజాగా సమీక్ష నిర్వహించారు. ఇదే అంశంపై కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి కూడా పలు అంశాలను వెల్లడించారు. దీంతో హైదరాబాద్ నుంచి కొత్త బుల్లెట్ ట్రైన్స్ కు సంబంధించి క్లారిటీ వస్తోంది. బుల్లెట్ ట్రైన్స్ హబ్ గా హైదరాబాద్ మారుతోంది.

**మంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన..**

భాగ్యనగరం నుంచి మూడు బుల్లెట్ ట్రైన్ల కారిడార్లను నిర్మించాలని తాజాగా రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ -చెన్నై.. హైదరాబాద్- బెంగళూరు.. హైదరాబాద్- ముంబై కారిడార్లు ఉన్నాయి. ఈ కారిడార్లకు సంబంధించి కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. అలైన్మెంట్లపై అధ్యయనాలు జరుగుతున్నాయని.. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత భూ సేకరణ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు భూ సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని తెలిపారు. ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవతో కిషన్ రెడ్డి తాజాగా భేటీ అయ్యారు. చెన్నై, బెంగళూరు, ముంబైలకు కనెక్టివిటీ కల్పిస్తూ ప్రతిపాదించిన హై స్పీడ్ బుల్లెట్ రైళ్ల కారిడార్లకు సంబంధించి అలైన్మెంట్లపై చర్చించారు.

**ప్రతిపాదనల తరువాత..**

ప్రతిపాదనలు పూర్తయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదన లేకుండా భూసేకరణ చేపట్టడం చట్ట విరుద్ధమని.. హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్ పేరుతో ఎవరైనా భూమిని సేకరిస్తే అది ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. అలైన్మెంట్ ఫిక్స్ అయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపుతామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పేర్కొన్నారు. అలైన్మెంట్, మార్కింగ్ ప్రక్రియపై స్పష్టత లేకపోవడంతో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి దృష్టికి కిషన్ రెడ్డి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అలైన్మెంట్ ఖరారు అయిన తర్వాత ప్రభుత్వాలు, రైతులకు పూర్తి సమాచారం అందిస్తామని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ అశ్విని వైష్ణవి తెలిపారు. అయితే బెంగళూరు తో పాటు చెన్నై వెళ్లే ఈ బుల్లెట్ ట్రైన్స్ కు సంబంధించి ఏపీకి కూడా అనుసంధానించనున్నారు.

# 'చే'జారుతున్న మైనారిటీలు!

(మొదటి పేజీ తరువాయి)

తాము కేవలం ఓటు బ్యాంకు సాధనంగా మాత్రమే మారిపోతున్నామన్న బాధ ముస్లిం వర్గాల్లో బలంగా పాతుకుపోతోంది. వారు కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా సొంత సామాజిక నాయకత్వాన్ని, ప్రత్యేక రాజకీయ వేదికలను వెతుక్కుంటున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ జెండా మోసిన వర్గాలే ఇప్పుడు రాష్ట్రానికి ముస్లిం ఆధారిత పార్టీని ఎగరేస్తూ హస్తం నీడను వదిలేస్తున్నారు.

**కేవలం ముస్లింలే అండ..**

ఇటీవల వరకు ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను నిశితంగా పరిశీలిస్తే ఇది స్పష్టంగా తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే తన ప్రాబల్యాన్ని చాటుకుందో.. ఆ స్థానాలన్నీ ప్రధానంగా ముస్లిం సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలే. అస్సాంలో కాంగ్రెస్ గెలిచిన అసెంబ్లీ స్థానాల్లో మెజారిటీ ముస్లిం ఎమ్మెల్యేలే కాగా.. కేరళలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ సాధించిన తిరుగులేని ఆధిక్యం వెనుక ముస్లిం లీగ్, ముస్లిం ప్రాబల్య ప్రాంతాలే వెన్నెముకగా నిలిచాయి. మెజారిటీ హిందూ వాటర్లు బిజెపి వైపు గుంప గుత్తగా మొగ్గు చూపుతున్న వేళ.. కాంగ్రెస్ తన రాజకీయ మనుగడ కోసం పూర్తిగా ముస్లిం జనాభా ఉన్న ప్రాంతాలపైనే ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారంలోకి రావడానికి వీరు ఓట్లను వాడుకుంటున్నప్పటికీ.. జాతీయస్థాయిలో హిందూ ఓట్లు ఎక్కడ చేజారి పోతాయో నన్న భయంతో.. ముస్లిం సమస్యలపై కాంగ్రెస్ హై కమాండ్ వ్యూహాత్మక మౌనం పాటించడం మొదలుపెట్టింది. ఈ వైఖరి మైనారిటీలలో ఆలోచనకు తెరతీస్తోంది.




**అస్సాంలో కంచుకోట బద్దలు..**

ముస్లిం మైనారిటీ లో ఉన్న అసంతృప్తి అస్సాంలోని నగావ్ లోక్సభ ఉప ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఈ సీటు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. కానీ తాజా ఎన్నికల్లో మైనారిటీ ఓటర్లు హస్తం పార్టీని తిరస్కరించారు. కాంగ్రెస్ వైఖరి పై విసిగిపోయిన మైనారిటీ వర్గాలు తమ సొంత ప్రాతినిధ్యం కోసం బద్రుద్దీన్ అజ్మల్ నేతృత్వంలోని ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ వైపు మళ్లారు. ఫలితంగా కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంలో డిపాజిట్ కూడా దక్కించుకోలేక.. కేవలం 1.22 లక్షల ఓట్లతో మూడో స్థానానికి పరిమితం అయింది కాంగ్రెస్ పార్టీ. ఏఐయుడిఎఫ్ ఏకంగా 5.2 లక్షల ఓట్లను కొల్లగొట్టింది. ముస్లిం ఓట్లు కాంగ్రెస్కు గుత్త సొత్తు కాదని.. బలమైన ప్రత్యామ్నాయ ముస్లిం నాయకత్వం లభిస్తే కాంగ్రెస్ ను కనీస పోటీలో లేకుండా పక్కన పెట్టేందుకు ఆ వర్గాలు సిద్ధంగా ఉన్నాయని నగావ్ ఉప ఎన్నిక స్పష్టమైన సంకేతం ఇచ్చింది. దేశవ్యాప్తంగా దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ కాంగ్రెస్ స్థానాన్ని ముస్లిం పార్టీ లేదా బలమైన ప్రాంతీయ పార్టీ భర్తీ చేస్తోంది. బెంగాల్ లో ముస్లింలు కాంగ్రెస్ ను పూర్తిగా విస్మరించి ఒక వైపు తృణమూల్ కాంగ్రెస్.. ఇంకోవైపు ఐఎస్ఎఫ్ వంటి శక్తుల వెంట నడుస్తున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఎంఐఎం కాంగ్రెస్ సంప్రదాయ మైనారిటీ ఓట్లను వేగంగా చీలుస్తోంది. హస్తం పునాదులను కదిలిస్తోంది. భవిష్యత్తులో ఇదే పరిస్థితి కొనసాగితే మైనారిటీలు కాంగ్రెస్ పార్టీకి చేజారినట్టే.

# అగ్రిగోల్డ్ చెల్లింపులు!

కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన డిపాజిటర్లందరికి దశలవారీగా డబ్బులు జమ చేయడమే లక్ష్యంగా యంత్రాంగం రంగంలోకి దిగింది. దీంతో బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎంతో కొంత న్యాయం జరుగుతుందని నమ్మకం పెట్టుకుంటున్నారు.

**అందుబాటులో ప్రత్యేక కేంద్రాలు..**

చెల్లింపుల ప్రక్రియలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 9 నుంచి ప్రత్యేక బాండ్ల పరిశీలన కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ సమీపంలోని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ వద్ద బాధితుల సౌకర్యార్థం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని దినాలలో ఈ కేంద్రాలు పని చేస్తాయి. రద్దీని నివారించేందుకు మండలాల వారీగా పక్కా షెడ్యూల్ను ఖరారు చేశారు. అక్టోబర్ 9, 10 తేదీల్లో రెడ్డిగూడెం.. 12,13 తేదీల్లో ఏ కొండూరు... 14,15 తేదీల్లో గంపలగూడెం... 16, 17 తేదీల్లో జి కొండూరు మండలాల బాధితుల బాండ్లను పరిశీలించనున్నారు. డిపాజిటర్లు, చట్టబద్ధ వారసులు, ఏజెంట్లు తమ వద్ద ఉన్న అసలు బాండ్లను తీసుకువచ్చి సంబంధిత అధికారుల బృందాలకు చూపించాల్సి ఉంటుంది.

**పక్కాగా నిబంధనలు..**

అయితే ఈ బాండ్ల పరిశీలనలో నిబంధనలను పక్కాగా పాటిస్తున్నారు. అసలు బాండ్ల రంగు జిరాక్స్ కాపీలపై అటెస్టేషన్ చేసి సమర్పించిన అనంతరం వారికి అధికారిక రసీదు అందజేస్తారు. డిపాజిటర్లు జీవించి ఉన్నట్లయితే ఆధార్, పాన్, బ్యాంక్ పాస్ బుక్ కాపీ, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, మొబైల్ నెంబర్, ఏజెంట్ వివరాలు సమర్పించాలి. ఒకవేళ డిపాజిటర్ మరణించినట్లయితే మరణ ధ్రువీకరణ పత్రం, నామిని గుర్తింపు పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు వంటి ఆధారాలు తీసుకురావాలి. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయిలో అర్హులైన అసలైన బాధితుల వివరాలు పారదర్శకంగా నమోదు కానున్నాయి. ఎక్కడ దళారుల ప్రమేయం లేకుండా.. నేరుగా నిధులు బాధితుల ఖాతాల్లోకి చేరేలా కట్టుదిట్టమైన వ్యవస్థను రూపొందిస్తున్నారు. త్వరలో మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహాలో ప్రత్యేక కేంద్రాల ద్వారా.. పూర్తిస్థాయి సమాచారాన్ని క్రోడీకరించి.. బాధితుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. దీంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.



# విద్యుత్ సంక్షోభం!

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడడం రేవంత్ సర్కార్కు గుదిబండగా మారింది. తెలంగాణ విద్యుత్ సంక్షోభంలో కూరుకు పోతోంది. మండుతున్న ఎండలు, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగంలో పెరిగిన విద్యుత్ అవసరాలు సరఫరా వ్యవస్థ పై పెను ప్రభావం చూపుతున్నాయి. అక్కడక్కడ విద్యుత్ కోతలు, నువ్వ వోల్టేజి సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

**పాత బకాయిల పేరుతో..**

సందట్లో సడే మియా అన్నట్టు ఇప్పుడు తెలంగాణ ప్రజలపై ట్రూ అప్ చార్జీల భారం పడింది. 2022-23, 2023 -24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ కొనుగోళ్లు, అదనపు వ్యయాలు, ఆదాయ లోటు లో సర్దుబాటులో భాగంగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి మొత్తం రూ.7635 కోట్ల ట్రూ ఆఫ్ చార్జీల వసూలుకు అనుమతించినట్లు సమాచారం. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2214 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించనుండగా.. మిగిలిన రూ.5420 కోట్ల వ్యవసాయేతర వినియోగదారుల నుంచి దశలవారీగా వసూలు చేయనున్నారు. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అదనపు విద్యుత్ బిల్లుల భారం మరింత భారంగా మారే అవకాశం ఉంది.



**ప్రజల్లో అసంతృప్తి..**

తెలంగాణలో తీవ్ర విద్యుత్ సంక్షోభం నెలకొంది. డిమాండ్ కు తగ్గట్టు సరఫరా కొనసాగడం లేదు. అవసరమైన విద్యుత్ను బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేయడంతో పాటు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా పై దృష్టి సారిస్తోంది ప్రభుత్వం. ఎత్తిపోతల పథకాలకు పిక్ అవర్స్ కు బదులుగా ఆఫ్ పీక్ సమయాల్లో విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం, నగరాల్లో సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, గ్రిడ్ల నిర్వహణను మెరుగుపరచడం వంటి చర్యలను అమలు చేయాలని భావిస్తోంది. మరోవైపు విద్యుత్ సమస్యలను అస్త్రంగా చేసుకుని విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. ప్రధానంగా గులాబీ పార్టీ దీనిని ఒక ఉద్యమం దిశగా తీసుకెళ్లాలని భావిస్తోంది. సహజంగానే ఇది అధికార పార్టీలో ఆందోళనకు కారణం అవుతోంది. అందుకే రేవంత్ సర్కార్ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది విద్యుత్ సమస్యలపై. చూడాలి చివరకు ఏం జరుగుతుందో..

# టీవీకే గెలిచింది!

(మొదటి పేజీ తరువాయి)

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ : తమిళనాడులో జరిగిన ఉప ఎన్నికల్లో టివి కే విజయం సాధించింది. ధారాపురం, మధురాంతకం ఉప ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కలగం గెలుపొందింది. బయటకు మిఠాయిలు పంచుకునేలా కనిపిస్తున్నా.. లోతుగా చూస్తే ఆ పార్టీ మూలాలనే కదిలించే హెచ్చరికలు పంపుతున్నాయి. అన్నా డీఎంకే నుంచి ఫిరాయించిన సిట్టింగ్ ఎమ్మెల్యేలనే బరిలోకి దింపి అధికార యంత్రాంగం అండతో నెట్టుకొచ్చిన ఈ విజయాల్లో.. విజయ్ ప్రజాదరణ కంటే.. ప్రత్యర్థుల పరస్పర వినాశన వ్యూహమే కీలకంగా మారింది. ధారాపురంలో టీవీకే అభ్యర్థి సత్యభామ 66,841 ఓట్లతో.. కేవలం 9,471 ఓట్ల స్వల్ప మెజారిటీతో గట్టెక్కారు. మధురాంతకంలో మరగాథం కుమారవేల్ 70,916 ఓట్లు సాధించి.. 19241 ఓట్ల ఆధిక్యతతో సరిపెట్టుకున్నారు. అయితే అధికార టీవీ కే సునామి ఇక్కడ కనిపించకపోవడం విశేషం.



**దక్కని ఏకపక్ష విజయం..**

డీఎంకేతో పాటు అన్నాడీఎంకే చీల్చిన ఓట్లతోనే విజయ్ పార్టీ గెలిచిందే తప్ప.. ఆ పార్టీకి ఏకపక్ష విజయం దక్కలేదు. ఒక్కసారి ఆ రెండు నియోజకవర్గాల్లో నమోదైన ఓట్ల లెక్కలను పరిశీలిస్తే అసలు విషయం తెలుస్తుంది. ధారాపురంలో టీవీ కేకు 66 వేల 841 ఓట్లు వచ్చాయి.. రెండో స్థానంలో నిలిచిన డీఎంకేకు 57,370 ఓట్లు వచ్చాయి. మూడో స్థానంలో నిలిచిన అన్నా డిఎం కేకు 45280 ఓట్లు పోలయ్యాయి. అంటే అన్నా డీఎంకే తో పాటు డీఎంకే కలిపి ఏకంగా లక్షా రెండు వేలకు పైగా ఓట్లు దక్కించుకున్నాయి. కానీ టీవీ కేకు వచ్చినవి కేవలం 66 వేల పైచిలుకు మాత్రమే. మధురాంతకంలోనూ అదే సీన్ కనిపించింది. అక్కడ టీవీకే 70,916 ఓట్లు సాధిస్తే.. డీఎంకే 51, 675.. అన్నా డీఎంకే 46431 కలిపి ఏకంగా 98,106 ఓట్లను కొల్లగొట్టాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో గెలిచిన అధికార పార్టీ ఓట్ల కంటే.. ద్రవిడ పక్షాల ఉమ్మడి ఓట్లు దాదాపు 30 వేల నుంచి 35 వేల వరకు అధికం. అంటే టీవీ కే ప్రజాదరణ పరిమితులను ఈ ఎన్నికలు స్పష్టంగా తెలియజేస్తోంది.

**రెండు పార్టీల మధ్య వైరం..**

తమిళ రాజకీయాల్లో డీఎంకే, అన్నా డీఎంకే లది దశాబ్దాల చరిత్ర. ఆ రెండు పార్టీల మధ్య వైరం, వ్యతిరేక ఓటు బ్యాంకు రెండు ముక్కలై విజయ్ వైపు మళ్లడంతో ఆయన విజయం సాధించారు. ఆ రెండు పార్టీల దశాబ్దాల వైరాన్ని పక్కన పెట్టి చేతులు కలిపితే విజయ్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయం. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు అన్నది సత్యం. విజయ్ చేతిలో ఇరు పార్టీల ఉనికికే ముప్పు వాటిల్లుతున్న తరుణంలో.. క్షేత్రస్థాయిలోనైనా అప్రకటిత ఓట్ల బదిలీ లేదా ఎన్నికల పొత్తుల వైపు ఈ రెండు ద్రవిడ శక్తులు అడుగులు వేస్తే టీవీకే మనుగడ ప్రశ్నార్థకంగా మారడం ఖాయం. ఈ రెండు నియోజకవర్గాల ఉప ఎన్నికలు విజయ్ ప్రభుత్వం నిలబడేందుకు అవసరమైన శాసనసభ స్థానాలను అందించాయే తప్ప... తిరుగులేని ప్రజామోదాన్ని నిరూపించుకోలేకపోయాయి. ద్రవిడ పార్టీలు బద్ధ శత్రువులుగా విడిపోయి ఉండడం వల్లే విజయ్ సీఎం కుర్చీలో నిలబడగలుగుతున్నారు. రెండు ద్రవిడ పార్టీలు ఒకే గొడుగు కిందకు వస్తే మాత్రం టీవీ కేకు చాలా కష్టం.



## నపారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్ లో అన్నదాన కార్యక్రమం

### ప్రారంభించిన మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూమ్ శ్రావణ్ కుమార్

**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** నపారి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నపారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్‌లో పేదల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేదల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యకార్యమని, సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న నపారి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, ఖాజా పటేల్, తూము ప్రవీణ్ పటేల్, సుందర్, అశోక్ రెడ్డి, సత్యనారాయణ, అడివయ్య, కృష్ణ, రమేష్, సతీష్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్‌లో మహిళలకే ఛాన్స్!

ఫైర్ బ్రాండ్ మాధవి లత పేరు ఉందా? లేకుంటే దివంగత పిజెఆర్ కూతురు విజయా రెడ్డికి పార్టీలోకి పిలిచి టిక్కెట్ ఇస్తారా? లేకుంటే నటి జీవితకు అవకాశం దక్కుతుందా? తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో దీని పైనే ప్రచారం నడుస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి దానం నాగేందర్ మరోసారి పోటీ చేయడం ఖాయమని తేలిపోయింది. అటు గులాబీ పార్టీ సైతం బలమైన అభ్యర్థిని రంగంలోకి దించనుంది. దీంతో బిజెపి సైతం సరైన అభ్యర్థిని పోటీలో పెట్టాలని భావిస్తోంది.

**ప్రతిష్టాత్మకంగా..**

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. కానీ ఇటీవల జరిగిన ఎన్నికలు ఆ పార్టీని కలవరపరుస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో మూడో ప్లేస్ కు పరిమితం అయిన ఆ పార్టీ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కూడా కోల్పోయింది. అందుకే ఖైరతాబాద్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో వ్యూహాలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో పోటీకి సిద్ధమవుతున్న చింతల రామచంద్రారెడ్డికి ఈసారి షాక్ తప్పేలా లేదు. గత రెండు ఎన్నికల్లో ఓడిపోవడం.. వయోభారం తో బాధపడుతుండడంతో పక్కన పెట్టాలని దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మాస్ లీడర్ గా పేరు ఉన్న దానం నాగేందర్ ను ఓడించడానికి అలాంటి మాస్ ఇమేజ్ ఉన్న అభ్యర్థి కోసం కాషాయ పార్టీ గట్టిగానే ప్రయత్నాలు చేస్తోంది.

**ఫైర్ బ్రాండ్ మాధవి లత..**

ఖైరతాబాద్ నుంచి మహిళ అభ్యర్థులు అయితే బాగుంటుంది అనేది హై కమాండ్ అభిప్రాయంగా తెలుస్తోంది. ప్రధానంగా ఫైర్ బ్రాండ్ మాధవి లత పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో ఆమె ఎంపీగా పోటీ చేశారు. గౌరవప్రదమైన ఓట్లు తెచ్చుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆమె చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. ఆపై పార్టీ విధానాలతో పాటు సమకాలిన




అంశాలపై దూకుడుగా వ్యవహరిస్తుంటారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో హిందూ ఓట్లను సమీకృతం చేస్తే ఆమె విజయం సునాయాసం అయ్యే అవకాశం ఉంది. అందుకే ఆమె వైపు బిజెపి హై కమాండ్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

**విజయా రెడ్డి పై ఆశలు..**

మరోవైపు దివంగత జనార్దన్ రెడ్డి కుమార్తె విజయ రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. పిజేఆర్ కుమార్తె గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో తనకు టిక్కెట్ ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. పైగా దానం నాగేందర్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఒకవేళ ఆమెకు టిక్కెట్ దక్కకపోతే.. బిజెపిలోకి రప్పించి టికెట్ ఇవ్వాలని భావిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో నుంచి పలుమార్లు పి.జనార్ధన్ రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. ఆయన కుటుంబానికి ఇక్కడ మంచి పేరు ఉంది. దానిని వాడుకోవాలని చూస్తోంది బిజెపి. ఇంకోవైపు నటి జీవిత పేరు కూడా తెరపైకి వచ్చింది. గత కొంతకాలంగా జీవిత దంపతులు బిజెపిలోనే కొనసాగుతూ వస్తున్నారు. ఆమెకు టిక్కెట్ ఇస్తే సినీ గ్లామర్ సైతం పనిచేసి విజయం సాధించే అవకాశం ఉందని హై కమాండ్ అంచనా వేస్తోంది. ఈ ముగ్గురు మహిళ నేతల్లో ఒకరికి బిజెపి టికెట్ ఖాయమని సమాచారం. చూడాలి చివరకు ఏం జరుగుతుందో.



## మృతుడి కుటుంబానికి అండగా మాజీ సర్పంచ్ ఎల్ఎన్ రెడ్డి

### శరణప్ప కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి (ఎల్ఎన్ రెడ్డి) అన్నారు. మండల కేంద్రానికి చెందిన బోనగిరి శరణప్ప అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి కడ్తాల్‌లోని శరణప్ప భౌతికకాయానికి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. సమాజ శ్రేయస్సే తమ ధ్యేయమని, మండల పరిధిలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోసిక యాదయ్య, రఘు, భిక్షపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవర చెరువు కట్టపై బతుకమ్మ గట్టు ఏర్పాటు

### మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి ప్రత్యేక చొరవ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్): బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు, ఆడపడుచులు వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు కడ్తాల్ గ్రామ సర్పంచ్ రాయికంటి బిక్షపతి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామంలోని దేవర చెరువు కట్టపై ముగ్గులు వేసి, బతుకమ్మలు పేర్చేందుకు అనువుగా బతుకమ్మ గట్టును సిద్ధం చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలను జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయడం తమ బాధ్యత అని సర్పంచ్ బిక్షపతి పేర్కొన్నారు. దేవర చెరువు కట్టపై బతుకమ్మ గట్టును సిద్ధం చేయడంతో మహిళలు, గ్రామ ఆడపడుచులు



సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనేలా, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా సర్పంచ్ తీసుకున్న చొరవను గ్రామస్తులు అభినందిస్తున్నారు.


GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. లక్ష పరిహారం ఇవ్వాలి

## విద్యుత్ కోతలతో ఎండిపోతున్న వరి పంటలు.. రైతుల పక్షాన పోరాడతాం: మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, లో వోల్టేజీ సమస్యలతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో విద్యుత్ సమస్యల కారణంగా ఎండిపోయిన వరి పంటలను కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జరుపుల దశరథ్ నాయక్ తో కలిసి ఆయన పరిశీలించారు. రైతులు వెలిజర్ల బాలరాజ్, గొల్లపల్లి పాండుగౌడ్‌తో పాటు పలువురు రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో బోరు మోటార్ల ద్వారా పంటలకు నీరందించలేకపోయామని రైతులు జైపాల్ యాదవ్‌కు వివరించారు. అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి పంటలు చివరి దశలో ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికి మూడు ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లిందని తమ గోడును వెళ్లబోసుకున్నారు.

**నాణ్యమైన విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలం....**

రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తే, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలు ఎండిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలో సమస్యల కారణంగా తరచూ లో వోల్టేజీ ఏర్పడుతోందని, దీంతో బోరు మోటార్లు సైతం దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేశామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ



హయాంలో కనీసం ఆరు గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ అందడం లేదని ఆయన విమర్శించారు. పంటలు చేతికొచ్చే కీలక దశలో విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

**ఎకరాకు రూ. లక్ష పరిహారం చెల్లించాలి...**

రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. వరి పంటలు చివరి దశలో ఉన్నందున నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని, విద్యుత్ సమస్యల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి ఎకరాకు రూ. లక్ష చొప్పున పరిహారం అందించాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొప్పిడి గోపాల్, ఉప సర్పంచ్ బందరి యాదయ్య, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నరసింహారెడ్డి, ఆనంద్, మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు వీరయ్య, మాజీ ఎంపీటీసీలు యాదయ్య, రంగయ్య, మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, వార్డు సభ్యుడు రవికుమార్, నాయకులు బండ లింగం, బీరప్ప, బిక్షపతి, రామకృష్ణ, పాండు, జమీర్, పవన్ కుమార్, రామచంద్రయ్య గౌడ్, రమేష్, యాదయ్య, నరసింహ, సాయికుమార్, రమేష్ గౌడ్, వెంకటేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



## బిఎస్పి కి ఓటుతోనే మన అభివృద్ధి

### తెలంగాణలో బహుజన పాలన తెచ్చే వరకు విశ్రమించను : ఇబ్రాం శేఖర్

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బహుజన్ సమాజ్ పార్టీ కి ఓటు వేయడం ద్వారానే బహుజనుల, వెనుకబడిన వర్గాలకు నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం మరియు అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఎస్పీ కి మనమంతా మద్దతుగా ఉండి తెలంగాణలో రాజ్యాధికార దిశగా సాగాలని కాన్షిరాం వర్ధంతిని పురస్కరించుకొని బడంగ్పేట్ లో నిర్వహించిన బహుజన రాజ్యాధికార సమరభేరి మహాసభలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ తెలిపారు. శుక్రవారం నాడు జిహెచ్ఎంసి బడంగ్పేట్ లోని సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్లో బహుజన రాజ్యాధికార సమరభేరి మహాసభను నిర్వహించగా బీఎస్పీ సెంట్రల్ స్టేట్ సెక్టార్ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ అతార్ సింగ్ హాజరయ్యారు. ఈ సభను ఉద్దేశించి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ సంవత్సరాలుగా బహుజనులను బానిసలుగా చేసి పాలకులుగా కొనసాగిన వారిని బానిసలుగా చేసి బహుజన రాజ్యాధికారం సాధించిన కాన్షీరామ్ ని మనమందరం ఆదర్శంగా తీసుకొని రాజ్యాధికార దిశగా సాగాలని, 85 శాతంగా ఉన్నా మన నుండి పన్నుల రూపేనా ఆదాయం పొందుతున్న, ప్రభుత్వం అందులో మనకు 15 శాతం మనకు ఇచ్చి 85శాతం ఆదాయాన్ని 15 శాతం ఉన్న అగ్రకుల పాలకులు పొందుతున్నారని దీనివలన మన బహుజనులకు దక్కాల్సిన న్యాయమైన విద్య, వైద్య, ఇతర సదుపాయాలు పొందలేకపోతున్నామని ఇప్పటికైనా మన ఓటుతో మన పాలన తెచ్చుకొని మన అభివృద్ధిని సాధించుకోవాలని, తెలంగాణలో బహుజనుల పాలన సాధించేవరకు తాను విశ్రమించనని ఇబ్రాం శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామకృష్ణ, నాయకులు పృథ్వీరాజ్, రవీందర్ నాయక్, ధర్మేందర్, నాగన్న, సతీష్, అనితారెడ్డి, బాహుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ రమాదేవి నరసింహ గౌడ్



**మునుగోడు, అక్టోబర్ 10 :** తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు మునుగోడులో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజైన 'ఎంగిలిపువ్వు బతుకమ్మ' వేడుకలను గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మునుగోడు గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పాల్గొన్నారు.. గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు, చారిత్రక శివాలయం మరియు మార్కండేయ దేవాలయాల్లో మహిళలతో కలిసి బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, మహిళలందరికీ సర్పంచ్ రమాదేవి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను అందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రకృతిని, పూలను ఆరాధించే ఏకైక పండుగ బతుకమ్మ అని గుర్తుకు తెచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

## మూడోసారి ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా గణపతి నాయక్



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 10: కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చౌటకూర్ మండల అధ్యక్షుడిగా గణపతి నాయక్ మూడోసారి నియమితులయ్యారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోడపట్ల గణేష్ ఆధ్వర్యంలో పార్టీ అనుబంధ విభాగాల నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా గణపతి నాయక్‌కు మరోసారి ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా గణపతి నాయక్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మూడోసారి అవకాశం కల్పించిన మంత్రి దామోదర రాజనర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోడపట్ల గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి, మల్లారెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దసరాకి ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త

### ఇంట్లో ఉన్న బంగారం నగదును తమ వెంట తీసుకెళ్లాలి.. లేదంటే లాకర్లో భద్రపరుచుకోవాలి

### ఎవరైనా అనుమాదాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలి

### బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి



**బాలానగర్, అక్టోబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** దసరా పండుగ కోసమని చాలా మంది ప్రజలు నగరాలు, పట్టణాలు విడిచి స్వగ్రామాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు రెచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో తాళం వేసిన ఇండ్లే టార్గెట్ చేసి నగరంలో పలుచోట్ల చోరీలకు పాల్పడుతున్నారు. విలువైన వస్తువులు, నగదు దోచుకెళు న్నారు. ఈ నేపథ్యంలో పండగకు సొంతూర్లకు వెళ్లే ప్రజలకు బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి కొన్ని సూచనలు, జాగ్రత్తలు జారీ చేశారు. దొంగల బారిన పడకుండా వీటిని తప్పని సరిగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఏసీపీ నరేష్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఊరికి వెళ్లినపుడు తప్పనిసరిగా సమీప పోలీస్ స్టేషన్లలో సమాచారం అందించాలని, దీని వల్ల పెట్రోలింగ్ పోలీసులు సంబంధిత నివాస గృహాలపై ప్రత్యేక నిఘా పెడుతారని స్పష్టం చేశారు. అలాగే ఇరుగు పొరుగుకు కూడా సమాచారం ఇవ్వాలని, మీ ఇంటికి సంబంధించి ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే మాకు తెలియజేయాలని విజ్ఞప్తి చేయాలని సూచించారు. ఊరికి వెళ్లేటప్పుడు ఎక్కువ బంగారం, డబ్బు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని, బీరువాలో విలువైన వస్తువులుంటే వాటి తాళాలు ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లాలని చెప్పారు. మీరు ఊరు వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, నేరగాళ్లు తెలుసుకుని, మీ ఇల్లు ఖాళీ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇంట్లో లైట్లు వేసి ఉంచాలని, తాళం బయటికి కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లో, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనుమానితులపై నిఘా ఉంచాలని, అలాంటి వారి గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపైనా అలర్ట్‌గా ఉండాలని, పండగ పేరిట వచ్చే ఆన్‌లైన ఆఫర్ల లింకులతో మోసపోవద్దని, బ్లూ కలర్ లింకులు అస్సలు ఓపెన్ చేయవద్దని, లాటరీ తగిలిందని, తక్కువ ధరకు గిఫ్ట్ వచ్చిందని వచ్చే మెస్సేజ్‌ను నమ్మవద్దని హెచ్చరించారు. సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకున్నట్టయితే వెంటనే 1930కి ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అత్యవసర సహాయం కోసం జాతీయ హెల్ప్‌లైన్ 112, 100కు కాల్ చేయాలని, పోలీసులకు ప్రజలు సహకరించాలని, పండుగను ఆనందోత్సాహంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ నరేష్ రెడ్డి సూచించారు.

## భక్తిభావంతో ఘనంగా హజ్రత్ షేక్ అలీషా 40వ ఉర్సు మహోత్సవాలు



హాజరైన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి అక్టోబర్ 10 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు పట్టణంలో హజ్రత్ షేక్ అలీషా 40వ ఉర్సు మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఈ వేడుకల్లో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్రా ఎల్లారెడ్డి, కౌన్సిలర్లు ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ?ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి చాదర్ సమర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మతసామ్రాస్యానికి, సర్వమత సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల్లో ఐక్యతను, శాంతిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. హజ్రత్ షేక్ అలీషా ఆశీస్సులు పట్టణ ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖశాంతులతో, సిరులతో వర్ధిల్లాలని ఆ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. బిఉత్సవాల సందర్భంగా దర్గా ప్రాంగణం విద్యుత్ కాంతులతో, భక్తుల కోలాహలంతో కళకళలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. బిఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ తాటికొండ కృష్ణ, షకీల్, రాములు యాదవ్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, రణధీర్ రెడ్డి, సునీల్ రెడ్డి, చెలిమిళ్ళ రాములు, ముస్లిం సోదరులు భక్తులు పాల్గొన్నారు



## అల్లే సాయికిరణ్, రూపాదేవి ఆధ్వర్యంలో 48వ డివిజన్లో ఘనంగా ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ఈరోజు శనివారం నాడు అల్లే సాయికిరణ్, రూపాదేవి ఆధ్వర్యంలో 48వ డివిజన్లో ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. సందర్భంగా అల్లే స్థాయికిరణ్ రూపా దేవి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలు మహిళల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి. పండుగ ప్రాంగణం బతుకమ్మ పాటలు, కోలాటాలు, మహిళల సందడితో పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా అల్లే సాయికిరణ్, రూపాదేవి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు. ఈ సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇప్పాయిపల్లిలో బతుకమ్మ సంబరాలు ప్రారంభం



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామంలో శనివారం బతుకమ్మ సంబరాలు గ్రామంలోని మహిళలు చిన్నారులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూలతో అలంకరించి ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించారు. తొలి రోజు అయినా ఎంగిలి పూల బతుకమ్మ ను తయారుచేసి గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా ఉల్లాసంగా చిన్నారులు ఆటపాటలతో వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# గుండాలలో బతుకమ్మ జాతర.. పూల సోయగాలతో పల్లెల్లో పండుగ జోరు!

**ఆటపాటలతో హోరెత్తిన ఆడపడుచులు.. తెలంగాణ సంస్కృతి వైభవానికి అద్దం పట్టిన బతుకమ్మ సంబరాలు!**

**పూల పరిమళాలతో పల్లెల్లో పండుగ కళ.. బతుకమ్మల చుట్టూ మహిళల కోలాహలం.. ఒక్కటైన గ్రామాల ప్రజలు!**

**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** పూలే పూజలు.. పాటలే సందడి.. ఆడపడుచుల ఆటపాటలే పల్లెలకు కొత్త కళ! తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో గుండాల మండలం పూలవనంగా మారింది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు, యువతుల సందడి.. మారుమోగిన బతుకమ్మ పాటలు.. చప్పట్లతో హోరెత్తిన ఆటపాటలు.. ఇలా మండలంలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. పల్లెపల్లెలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళల ఆనందోత్సాహాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**"పూల సోయగాలతో బతుకమ్మలు.. చూపు తిప్పుకోలేని అందాలు"!**

తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి అలంకరించారు. ఒక్కో పువ్వును అందంగా పేర్చి తీర్చిదిద్దిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే సంప్రదాయం పల్లె వాతావరణానికి మరింత శోభను తీసుకొచ్చింది.

**"పాటల హోరు.. ఆటపాటల జోరు"!**







గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, దేవాలయాల పరిసరాల్లో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడారు. చప్పట్లు కొడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ సంబరాల్లో భాగస్వాములు కావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

**"తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ"!**

బతుకమ్మ పండుగ కేవలం పూల వేడుక మాత్రమే కాదు.. తెలంగాణ మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, ప్రకృతి ఆరాధనకు ప్రతీక. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. మహిళలు సంప్రదాయాలను కొనసాగిస్తూ భావితరాలకు సాంస్కృతిక వారసత్వాన్ని అందించడం ఈ పండుగ ప్రత్యేకతగా నిలుస్తోంది.

**"పల్లెపల్లెలో ఐక్యత.. వేడుకల్లో గ్రామ పెద్దల సందడి"!**

గుండాల మండలంలోని వివిధ గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ప్రజలను ఒక్కచోట చేర్చాయి. గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పరస్పరం కలుసుకుంటూ పండుగ శుభాకాంక్షలు పంచుకున్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల సంప్రదాయ ఆటపాటలు, ప్రజల కలయికతో గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పూల పండుగతో పల్లెలకు కొత్త కళ.. ఆడపడుచుల ఆనందంతో ప్రతి వీధిలో పండుగ వెలుగు! తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెబుతూ గుండాల మండలంలో బతుకమ్మ సంబరాలు ప్రజల్లో ఐక్యతను, సంతోషాన్ని నింపాయి.





## పూలను ప్రకృతిని ఆరాధించే ఏకైక పండుగ బతుకమ్మ : సర్పంచ్ రమాదేవి

**మునుగోడు, క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 10 :** తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు మునుగోడులో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజైన 'ఎంగిలిపువ్వు బతుకమ్మ' వేడుకలను గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మునుగోడు గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పాల్గొన్నారు.. గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు, చారిత్రక శివాలయం మరియు మార్కండేయ దేవాలయాల్లో మహిళలతో కలిసి బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, మహిళలందరికీ సర్పంచ్ రమాదేవి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను అందరూ సుఖసంతోషాలతో, ఐకమత్యంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రకృతిని, పూలను ఆరాధించే ఏకైక పండుగ బతుకమ్మ అని గుర్తుకు తెచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

# బాలానగర్‌లో కనుల పండువగా 'ఎంగిలిపూల బతుకమ్మ' సంబరాలు..!

**ఆడపడుచులతో జతకట్టి బతుకమ్మ పాటలతో ఆడిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**





**బాలానగర్, అక్టోబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్ డివిజన్‌లో 'ఎంగిలిపూల బతుకమ్మ' వేడుకలు శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్ప రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పులి శ్రీకాంత్ పటేల్, బాలానగర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పులి శివ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాలకు మహిళలు, ఆడపడుచులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ వేడుకలకు మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఇందిరమ్మ చీరలు ధరించి ప్రత్యేక ఆకర్షణంగా నిలిచారు. బాలానగర్ పరిసరాల నుంచి మహిళలు, ఆడపడుచులు తీరొక్క పువ్వులతో అద్భుతంగా అలంకరించిన బతుకమ్మలను ఇళ్ల నుంచి డప్పు చప్పుళ్ల మధ్య దుర్గామాత ఆలయం ప్రాంగణానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ఆవరణలో బతుకమ్మలను మధ్యలో ఉంచి, వృత్తాకారంలో తిరుగుతూ... 'చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మా', 'మా తల్లీ బతుకమ్మ...' అంటూ శ్రావ్యంగా పాటలు పాడుతూ, ఉత్సాహంగా ఆడిపాడిన తీరు అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ బతుకమ్మ ఆటపాటలు తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను సజీవంగా ఆవిష్కరించాయి. ఈ సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ, "తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుందని, ముఖ్యంగా తెలంగాణ ఆడపడుచులకు ఇది ఎంతో ప్రత్యేకమైనది" అన్నారు. నేటి సంబరాలు మన సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్నాయని, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవితంలో ఒక అవిభాజ్య భాగం అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, శాంతియుతంగా సాగేలా పర్యవేక్షించిన బాలానగర్ పోలీస్ ఎస్ఐలు మనోహర్ రెడ్డి, హాజీ మియా, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధికారప్రతినిధి మధు మోహన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు ఏరపుల మహేందర్, మహమ్మద్ హాజి, పులి శ్రీకాంత్ గౌడ్, సదా గౌడ్, దాండు రవి గౌడ్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) లైన్ అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రారంభించిన పి ఎస్ సి చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**





**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారి, జయనగర్ ప్రాంతాల్లో తరచూ తలెత్తుతున్న మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి చేపట్టిన భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనుల్లో భాగంగా దెబ్బతిన్న 450 ఎంఎం వ్యాసం గల ఆర్ సి సి ఎన్ పి4 మురుగునీటి పైపులైన్‌ను మార్చడంతో పాటు, ఎల్లమ్మబండ ప్రధాన రహదారి, జయనగర్ హైటెన్షన్ రోడ్డులోని 600 ఎంఎం ఆర్ సిసి మురుగునీటి పైపులైన్‌కు సంబంధించిన మ్యాన్‌హోళ్ల పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నారు. దీంతో తరచూ ఎదురవుతున్న మురుగునీటి ఓవర్‌ఫ్లో సమస్యలను తగ్గించి, స్థానిక ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఏర్పడనుంది. ఈ పనులకు సంబంధించిన "శిలాఫలకం" ప్రకారం, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై ం సీవరేజ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శంకుస్థాపన (ఇనాగ్రేషన్) కార్యక్రమానికి ముఖ్యఅతిథి "శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, పి ఎస్ సి చైర్మన్ అరికెపూడి గాంధీ తో కలిసి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు దీర్ఘకాలంగా ఇబ్బందిగా మారిన సీవరేజ్ ఓవర్‌ఫ్లో, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా సీవర్ లైన్ ఏర్పాటు పనులు చేపట్టడం, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కలిపించడంలో భాగంగా ఈ పనులు పూర్తయితే, ఎల్లమ్మబండ ప్రధాన రహదారి, జయనగర్ హైటెన్షన్ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చేపటే దిశగా ఈ అభివృద్ధి పనులతో స్థానిక ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, మహిళనాయకులు, కాలనీవాసులు, యువకులు, టీం పట్వారీ తదితరులు భారీగా పాల్గొన్నారు.



# రంగురంగుల పూల సోయగం..

**ఆడపడుచుల ఉయ్యాల పాటల నాదం**

**ప్రగతి నగర్‌లో బతుకమ్మ వైభవం**

**గునుగు, తంగేడు పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు.**

**నిజాంపేట్ అక్టోబర్ 10 (క్రైమ్ మిర్రర్):** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతి నగర్‌లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన తొమ్మిది రోజుల పూల పండుగ తొలి రోజు కావడంతో స్థానిక కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు పండుగ శోభతో కళకళలాడాయి. సంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించిన మహిళలు, చిన్నారులు ప్రకృతి సిద్ధమైన గునుగు, తంగేడు, బంతి, చామంతి పూలతో రంగురంగుల బతుకమ్మలను తీర్చిదిద్దారు. అపార్ట్‌మెంట్ ప్రాంగణాలు, కాలనీ కూడళ్లలోని బతుకమ్మ ఘాట్ల వద్ద గౌరమ్మను కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి 'రామ రామ ఉయ్యాల..', 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల..' అంటూ లయబద్ధమైన చప్పట్లతో జానపద గీతాలు ఆలపిస్తూ కోలాటాలు ఆడారు. చిన్నారుల కేరింతలు, మహిళల ఉత్సాహపూరిత ఆటపాటలతో ప్రగతి నగర్ పరిసర ప్రాంతాలన్నీ పల్లె వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# టిఎస్ టిఎస్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావు పై తీవ్ర ఆగ్రహం

**ఎమ్మెల్సీ బల్మూరీ వెంకట్ పై వాక్యాలను ఖండించిన.. కూకట్ పల్లి కాంగ్రెస్ నాయకుడు జిట్ట సునీల్ యాదవ్**





**కూకట్ పల్లి, అక్టోబర్ 10 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పైన మాజీ టీఎస్ టీఎస్ చైర్మన్ పాటిమీది జగన్మోహన్ రావు చేసిన వ్యాఖ్యలను కూకట్ పల్లి కాంగ్రెస్ సీనియర్ యూత్ నాయకుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎన్ ఎస్ యు ఐ మాజీ అధ్యక్షుడు సునీల్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. బల్మూరి వెంకట్ సంబంధించి వ్యక్తిగత జీవితాన్ని తెరపైకి తేవడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఆ విషయం పైన కూకట్ పల్లి గ్రామ ప్రజలకు అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. వారి ఇద్దరికీ నచ్చకనే విడిపోయారని తర్వాత బల్మూరి వెంకట్ వేరే వివాహం చేసుకున్నారని అన్నారు. రెండు నెలల క్రితం ఇదే జగన్మోహన్ రావు ఇంటి ముందు ఓ మహిళ రోడ్డుమీద బైఠాయించి తనకు న్యాయం చేయాలని తనను హింసిస్తున్నారని ఆరోపించిన ఘటనను మీరు మరిచిపోయారా అని ప్రశ్నించారు. ఆడపిల్లలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం మంచిది కాదని హెచ్చరించారు. బల్మూరి వెంకట్ ను విమర్శిస్తే కేటీఆర్ అభినందించి పదవులు ఇస్తారని ఆశపడి మీరు ఈ పని చేయడం మంచి సంస్కారం కాదని అన్నారు. వెంటనే జగన్మోహన్ రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని జిట్టా సునీల్ తో పాటు కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

# ఖమ్మం 39 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పాలకుర్తి వెంకన్న



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఖమ్మం నగరం 39వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పాలకుర్తి వెంకన్న నియామకమైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో డివిజన్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి యువ నేత తుమ్మల యుగేంధర్ కు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఖమ్మం నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. 39వ డివిజన్లో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేసి కార్పోరేషన్ ఎన్నికల్లో విజయ ఢంక మోగించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ నెల 12న టిటిడి ఆధ్వర్యంలో కలియుగ దైవంశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ భూమి పూజకు డివిజన్ ప్రజలు తరలిరావాలని కోరారు.

# పూల పండగకు కోదాడ వస్తాబు, ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు







**కోదాడ, అక్టోబర్ 10(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు కోదాడ పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు, కమిషనర్ రమాదేవి పుట్టమన్నుతో గౌరమ్మను ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను పూజించడం తెలంగాణ సంస్కృతిలో విశిష్టమైన సంప్రదాయమని పేర్కొన్నారు. బతుకమ్మ ఆటలు, పాటలు మహిళల ఐక్యతకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటడంతోపాటు ప్రకృతి ఆరాధనకు, కుటుంబ సుఖసంతోషాలకు, సామాజిక ఐక్యతకు ప్రతీకలని అన్నారు. మా ఇంటి ఇలవేల్పు గౌరమ్మ రావమ్మా' అంటూ మహిళలు ఆలపించిన బతుకమ్మ పాటలు ప్రాంగణంలో సందడి నింపాయి. తంగేడు, గునుగు, బంతి తదితర రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో పాల్గొన్నారు.

**భారీ ఏర్పాట్లు.. మహిళల్లో ఉత్సాహం**

బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని మున్సిపల్ పాలకవర్గం బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు చేసింది. మహిళలు బతుకమ్మ ఆడేందుకు అనువుగా మైదానాన్ని సిద్ధం చేయడంతోపాటు మైక్ సదుపాయం, కోలాట ప్రదర్శనకు ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్ వసతులు కల్పించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరశెట్టి మల్లీశ్వరి, మహిళా మండలి అధ్యక్షురాలు నూనె సులోచన, మున్సిపల్ మాజీ చైర్మన్ సామినేని ప్రమీల, కౌన్సిలర్లు వాడపల్లి రంగమ్మ, గుండపనేని పద్మ, తోట జ్యోతి శ్రీనివాస్, సామినేని రజని, రామ్‌శెట్టి ఉదయశ్రీ, తుమ్మల నాగేంద్రమ్మ, మహిళా నాయకురాళ్లు నెమ్మాది దేవమణి, మాతంగి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయంలో నల్గొండ అదనపు కలెక్టర్

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 10: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం నల్గొండ అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు బద్రు, అరుణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వెలిమినేడులో ఘనంగా వెంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడుగ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వెలిమినేడు గ్రామంలో వెంగిలిపువ్వు బతుకమ్మ ఉత్సవాలను మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రారెడ్డి, ఉపసర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్, వార్డు సభ్యుడు నోముల రామకుమార్, పంచాయతీ కార్యదర్శి తాటికొండ లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతటి పారిజాత నరసింహ, మాజీ సర్పంచ్ దేశభైన మల్లమ్మ, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అంశాల సత్యనారాయణ, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ వీరేశం, కాంగ్రెస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కర్నూరి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి గోలి నరేష్, ఉపాధ్యక్షుడు తాటికొండ సత్యనారాయణ, మాజీ వార్డు సభ్యురాలు అంతటి శోభా రాజు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆరూరి శ్రీశైలం, బీజేపీ నాయకుడు వెల్ది రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన పెంటన్నను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో పరిగి ఆర్టీసీ సంఘం తరపున రాకంచెర్ల పెంటన్న ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పూడూరు మండల ఎమ్మార్పీఎస్ నాయకులు దేవనోనిగూడా. వెంకటన్న మాదిగ ఎమ్మార్పీఎస్ పూడూరు మండల ఇన్చార్జి యేసు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నరేష్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవలో రాకంచెర్ల పెంటన్న సేవలు మరువలేనివని, అందుకే పరిగి ఆర్టీసీ ఉద్యోగులు ఆయనను ఎన్నుకోవడం గర్వించదగ్గ విషయమని వారు పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పూడూరు మండల అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ, ప్రకాష్ మాదిగ, కిష్టయ్య మాదిగ, చంద్రయ్య మాదిగ, శేఖర్ మాదిగ, శ్రీను మాదిగ, రమేష్ మాదిగ పోడూరు మండల తదితర గ్రామాల ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఒకచోట చేరారు. బతుకమ్మల చుట్టూ వలయాకారంగా తిరుగుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం విశేషం. మహిళలు, గ్రామ ప్రజలు ఈ వేడుకల్లో పాల్గొని పండుగ సంబరాలను పంచుకున్నారు. ఈనాటి కార్యక్రమంలో సర్పంచ్ లు మహేశ్వరం మల్లికార్జున్, ఇమ్మడి జయకుమార్, సురకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి,గాద్దుల లింగరాజు, పాండవుల లింగయ్య, గుగులోతు కృష్ణ,లావుద్య జ్యోతి సుధాకర్,గుగులోత్ కోటేష్,జటంగి సరిత కృష్ణ,అంజపెల్లి నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మా ప్లాట్లు మాకే కావాలి.. బాధితుల ఆందోళన!



వెంచర్‌లో తొలగించిన హద్దురాళ్లు..

### మూడు రోజుల్లో తిరిగి ఏర్పాటు చేస్తామని రియల్టర్ హామీ

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** కొనుగోలు చేసిన ప్లాట్లకు సంబంధించిన హద్దురాళ్లను తమకు తెలియకుండా తొలగించడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్లాట్లను గుర్తించే హద్దురాళ్లను తొలగించడంపై నిరసన తెలుపుతూ వెంచర్ వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని బండోనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని సర్వే నంబర్లు 294, 97, 98, 99 పరిధిలో 2012 సంవత్సరంలో సుమారు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేశారు. ఇందులో పలువురు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు బాధితులు తెలిపారు. అయితే, తమకు తెలియకుండా ప్లాట్ల హద్దురాళ్లు తొలగించడంతో ఆందోళనకు గురయ్యామని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ సంగీత శేఖర్‌రెడ్డి సమాచారం ఇవ్వడంతో వెంచర్ వద్దకు వచ్చి పరిశీలించామని, తమ ప్లాట్ల హద్దురాళ్లు కనిపించకపోవడంతో నిరసనకు దిగినట్లు బాధితులు తెలిపారు. కొనుగోలు చేసిన ప్లాట్లను తమకు అప్పగించి, న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సంబంధిత రియల్టర్ లతీఫ్ ఖాన్ బాధితులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వెంచర్‌ను చదును చేసే క్రమంలో కొన్ని హద్దురాళ్లు తొలగిపోయాయని, మూడు రోజుల్లో సంబంధిత ప్లాట్ల కొనుగోలుదారులకు తిరిగి హద్దురాళ్లు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అంతేకాకుండా నాలా కన్వర్షన్ ప్రక్రియను పూర్తి చేయిస్తానని, తొలగిపోయిన చెట్లను సైతం తిరిగి నాటిస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. రియల్టర్ ఇచ్చిన హామీతో బాధితులు సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆందోళన సద్దుమణిగింది. ఇచ్చిన హామీ మేరకు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

## దళిత మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### మాదిగలపై దాడులు పునరావృతం కాకుండా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

### షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దప్పు యాదయ్య డిమాండ్




పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09: నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామంలో గ్రామ సంస్థలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ)గా పనిచేస్తున్న గారేపల్లి మాధవిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దప్పు యాదయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 3వ తేదీన గ్రామసభ జరుగుతున్న సమయంలో మాజీ సర్పంచ్ భర్త అమర్నాథ్ గౌడ్, మాధవిపై దాడి చేసి, జుట్టు పట్టుకుని కింద పడేసి చెంపలపై కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించారని యాదయ్య ఆరోపించారు. బహిరంగంగా గ్రామసభ జరుగుతున్న సమయంలోనే మహిళపై దాడి జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ ప్రభుత్వం స్పందించి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. దాడులకు పాల్పడిన వారికి శిక్షలు విధించడంతో పాటు జరిమానాలు కూడా విధించి, భవిష్యత్తులో దళితులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై దాడులు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఘటనలను తీవ్రంగా పరిగణించి, దళితుల హక్కులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఢిల్లిలో సిపియం జాతీయ నాయకులు విద్యార్థుల పై బి.జె.పి నిర్బంధాన్నీ అరెస్ట్ లను నిరసిస్తూ సిపియం ఆధ్వర్యంలో జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం

### సిపియం రాష్ట్ర కమిటి సభ్యురాలు మాచర్ల భారతి




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఢిల్లిలో సిపియం జాతీయ నాయకులు విద్యార్థుల పై బి.జి.పి నిర్బంధాన్నీ అరెస్ట్ లను నిరసిస్తూ సిపియం జిల్లా, పట్టణ మరియు మండల కమిటీల ఆధ్వర్యంలో ప్రధాన ఎన్నికల కమీషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుండి తొలగించాలని దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. శనివారం రోజున స్థానిక సుందరయ్య భవన్ నుండి ప్రారంభమైన నిరసన కార్యక్రమం సరిత క్లినిక్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్ర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సిపియం రాష్ట్ర కమిటి, మండల, పట్టణ కమిటి నాయకులు పాల్గొని సరిత క్లినిక్ సెంటర్ లో ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసినారు. అనంతరం కార్యక్రమంలో సిపియం రాష్ట్ర కమిటి సభ్యురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ ఢిల్లీ నగరంలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ పదవి నుండి వైదొలగాలని కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అక్రమంగా సిపియం జాతీయ కార్యదర్శి యం. ఎ. బేబి మరియు సిపియం నాయకులను, విద్యార్థులను అరెస్ట్ చేసి నిర్బంధించటాన్ని ఖండించారు. బిజెపి అవలం బిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అదే విధంగా సర్ పేరుతో ఓటర్లను తొలగించడం దేశ ద్రోహ చర్యలుగా అభివర్ణించారు. దేశ వ్యాప్తంగా వామపక్షాలు ప్రజా సంఘాలు ఢిల్లీ జంతర్ మంతర్ ముట్టడి కార్యక్రమానికి చేరుకుంటున్న తరుణంలో ఢిల్లీ కు వెళ్ళే వందల రైళ్ళను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఢిల్లీకు వస్తున నాయకులను విద్యార్థాలను ప్రతిచోట అరిస్టు చేసి ఉద్యమాలను ఎంతో కాలం ఆపలేదన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచి తొలగించాలని, తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చాలన్నారు. పరిస్థితు ఇలాగే కొనసాగితే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారీ జ్ఞానేష్ కుమార్ ఓట్ల దొంగతనానికి పాలఎడ్డారన్నారు. దేశం మొత్తంగా 13 కోట్ల ఓటర్లను తొలగించడం రాజ్యాంగ విరుద్ధం అని వెంటనే జ్ఞానేష్ కుమార్ ను పదవి నుండి తొలగించాలన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ లో ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను, జ్ఞానేష్ కుమార్ ఓట్ల దొంగతనం కు నిరసిస్తు పాల్గొన్న సిపియం జాతీయ కార్యదర్శి యం. ఎ. బేబి, పార్టీ నాయకులు, విద్యార్థులను వెంటనే బేషరతుగా, విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు , జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, ఎమ్. సుబ్బారావు సీనియర్ నాయకులు, జిల్లా కమిటి సభ్యులు నందిపాటి మనోహర్, మీరా, బండారు రమేష్, జాజిరి శ్రీనివాస్, పిన్నింటి రమ్య, ఖమ్మం 3వ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాస్, ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల తిరుపతి రావు,2వ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, అర్బన్ కార్యదర్శి బత్తిని ఉపేదర్, జిల్లా నాయకులు ఆర్ ప్రకాశ్, బొడ్డు మధు, జి. శ్రీదేవి, పి.నరసింహారావు, భాగం అజిత, పాపారావు, షేక్ సైదులు మాజీ కార్పొరేటర్ ఎర్రా గోపి, మురహరి, బీబి, చిలకల వెంకటేశ్వర్లు తదితరులు వున్నారు.

# ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం...

## మానసిక ఆరోగ్యంపై అవగాహనతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఖమ్మం పట్టణంలోని డీపీఆర్‌సీ భవనంలో తాళ్లూరి లక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ రీజినల్ ఇంటెలిజెన్స్ అధికారి శ్రీరామోజు రమేష్, ఖమ్మం జైలు సూపరింటెండెంట్ సక్రు నాయక్, డాక్టర్ సతీష్ బాబు, క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ మంజుల, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి, సైకాలజిస్ట్ ఏ. నాగరాజు, డాక్టర్ టి. సృజన్ కుమార్, డీసీపీఓ విష్ణు వందన, ఏపీఏఐ అధ్యక్షుడు ఈ. వెంకటేశ్వర్లు, బి స్వాతి ఇన్ఫినిటీ సీడీసీ,బి. పవన్ కళ్యాణ్ ఫిజియోతెరపిస్ట్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ సమన్వయకర్తగా దాసరోజు శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం వంటి అంశాలు వ్యక్తుల మానసిక స్థితిపై ప్రభావం చూపుతాయని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడంతోపాటు ఒత్తిడిని అధిగమించేందుకు సరైన అవగాహన, ఆత్మవిశ్వాసం, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మానసిక సమస్యలను బలహీనతగా భావించకుండా.. బాధితుల మనసును అర్థం చేసుకోవాలి. మానసిక ఇబ్బందులతో బాధపడుతున్నవారిని విమర్శించడం, కించపరచడం కాకుండా వారికి భరోసా కల్పించాలని వక్తలు సూచించారు. కొన్నిసార్లు సానుభూతితో వినే ఒక మనసు, ఆప్యాయంగా పలకరించే ఒక మాట, అండగా నిలిచే ఒక చేయి ఒక వ్యక్తి జీవితంలో ఎంతో మార్పును తీసుకురాగలవని వివరించారు.

మానసిక ఆరోగ్యంపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, బాధితుల పట్ల గౌరవం, సానుభూతి, సహకారం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మానసిక సమస్యలు ఎదురైనప్పుడు వాటిని దాచిపెట్టకుండా, అవసరమైన సమయంలో మానసిక ఆరోగ్య నిపుణుల సలహాలు, వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు. మానసికంగా ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులే కుటుంబానికి, సమాజానికి మరింత సమర్థవంతంగా సేవలందించగలరని తెలిపారు. మానసిక ఆరోగ్యం అనేది వ్యక్తిగత అంశం మాత్రమే కాదని, అది కుటుంబాల శ్రేయస్సుకు, సమాజ అభివృద్ధికి కూడా కీలకమని అభిప్రాయపడ్డారు. "మానసిక ఆరోగ్యమే సంపూర్ణ ఆరోగ్యానికి పునాది. వినడం మన బాధ్యత, అర్థం చేసుకోవడం మన మానవత్వం, అండగా నిలవడం మన సామాజిక బాధ్యత" అనే సందేశంతో ఈ కార్యక్రమం మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన మానవతావాదులు, మానసిక ఆరోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయుడు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** పాత్రికేయుడు, భవిష్యత్ ప్రజాపాలన పత్రిక చేవెళ్ల నియోజకవర్గ రిపోర్టర్ శ్రీనివాస్ జన్మదిన వేడుకలు పత్రికా మిత్రులు, స్నేహితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్, సంజీవ, గండేటి రాజేష్ గౌడ్, వంశీ, రఘునందన్ రెడ్డి, జర్నలిస్టు రవికుమార్, భాస్కర్ రెడ్డితో పాటు మిత్ర బృందం కలిసి జన్మదిన వేడుకలను ఆత్మీయంగా నిర్వహించి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సీనియర్ పాత్రికేయుడిగా జర్నలిజం రంగంలో తనదైన గుర్తింపుతో ముందుకు సాగుతున్న శ్రీనివాస్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవిస్తూ జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని మిత్రులు ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల గొంతుకగా నిలిచి తన కలం ద్వారా సమాజానికి మరింత సేవ చేయాలని అభిలషించారు. పత్రికా మిత్రులు, జర్నలిస్టులు, స్నేహితుల ఆత్మీయత, శుభాకాంక్షల మధ్య జరిగిన ఈ జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా సాగాయి.

## కనుల పండగ బతుకమ్మ వేడుక



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి న్యూ బీసీ కాలనీ లో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు మహిళలందరూ కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆరవ వార్డు మెంబరు నీలకంఠశ్రీ విజయ లింగస్వామి కాలనీ మహిళలతో కలిసి బతుకమ్మ సంబరంలో పాల్గొనడంతో కాలనీ వాసులతో ఆటపాటలతో సందడి నెలకొంది మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా చేశారు

# ఎస్ఐఆర్ పేరుతో ఓటు చోరీకి పాల్పడుతున్న మోదీ ప్రభుత్వం




### జ్ఞానేశ్ కుమార్‌ను ఎంతోకాలం కాపాడలేరు

### ప్రజా ఉద్యమాలను అణచివేసే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదు

### సంగారెడ్డిలో సీపీఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం..

### నల్లజెండాలతో నిరసన

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 10:** ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను మోదీ ప్రభుత్వం ఎంతకాలం కాపాడుతుందని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల నేతలు, నిరసనకారులపై పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తూ శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నల్లజెండాలతో ఆందోళన నిర్వహించి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా ఉద్యమాలను అణచివేసే హక్కు ఎవరికీ లేదన్నారు. నిరసనకారులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు, కేరళ ప్రతిపక్ష నేతలు, సీనియర్ నాయకులు సహా పలువురు నేతలను నిర్బంధించడాన్ని ఆయన ఖండించారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా, స్వతంత్రంగా పనిచేయాల్సి ఉండగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితా నుంచి ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించినట్లు లెక్కలు వస్తున్నాయని చుక్క రాములు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, మాణిక్, సాయిలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, రేవంత్, నాయకులు అశోక్, బాలరాజు, శివకుమార్, దత్తు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# వెల్దండలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

### మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** వెల్దండ మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. సాయంత్రం వేళ బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక బతుకమ్మ కుంటలో నిమజ్జనం చేశారు. బతుకమ్మ సంబరాల్లో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పాల్గొని మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లకు స్టైపెండ్‌లో సమానత్వం కల్పించాలి

### నెలకు రూ.29,792 చెల్లించాలి.. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

### అక్టోబర్ 14 నుంచి డీఎంఈ కార్యాలయం వద్ద నిరసనకు సిద్ధం




సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 10: తెలంగాణలో విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)లో ఉత్తీర్ణులైన వైద్య ఇంటర్న్‌లకు స్టైపెండ్‌లో సమానత్వం కల్పించాలని తెలంగాణ ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లు డిమాండ్ చేశారు. భారతీయ వైద్య పట్టభద్రుల ఇంటర్న్‌లతో సమానంగా తమకు కూడా నెలకు రూ. 29,792 స్టైపెండ్ చెల్లించడంతో పాటు, వర్తించే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఎఫ్ఎంజీఈలో ఉత్తీర్ణులైన అనంతరం ఆసుపత్రుల్లో కంపల్సరీ రొటేటింగ్ మెడికల్ ఇంటర్న్‌షిప్ (సీఆర్ఎంఐ) నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమయంలో ఓపీడీ, వార్డులు, క్యాజువాలిటీ, అత్యవసర వైద్య విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ, అనేక మంది ఇంటర్న్‌లకు ఎలాంటి స్టైపెండ్ చెల్లించడం లేదని, మరికొందరికి నెలకు కేవలం రూ. 5,000 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించామని, సెప్టెంబర్ 23న తెలంగాణ వైద్య విద్యా సంచాలకులకు (డీఎంఈ) వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సంతృప్తికరమైన లిఖితపూర్వక పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 8 నుంచి శాంతియుతంగా సామూహిక నిరసన చేపడుతున్నట్లు వెల్లడించారు. సమస్య పరిష్కారం కాకపోతే అక్టోబర్ 14 నుంచి డీఎంఈ కార్యాలయాన్ని కలిసి, స్టైపెండ్ సమానత్వంపై స్పష్టమైన గడువులు, బాధ్యతలతో కూడిన అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలని కోరనున్నట్లు తెలిపారు. తెలంగాణ వైద్య విద్యా సంచాలకులు, ఆరోగ్య శాఖ, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఒకే విధమైన విధులు నిర్వహిస్తున్నప్పుడు స్టైపెండ్‌లోనూ సమానత్వం ఉండాలని స్పష్టం చేశారు.

# గుమ్మడిదల ప్రగతికి నాంది కేసీఆర్

### నూతన మండల ఏర్పాటుతోనే అభివృద్ధికి పునాది

### కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీఆర్ఎస్ నాయకులు



గుమ్మడిదల, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 10: గుమ్మడిదలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేసి ప్రాంత అభివృద్ధికి పునాది వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల నూతన మండలంగా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2016లో కేసీఆర్ ప్రభుత్వం గుమ్మడిదలను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయడంతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. మండల ఏర్పాటు తర్వాత మౌలిక వసతుల అభివృద్ధికి మార్గం సుగమమైందని పేర్కొన్నారు. గుమ్మడిదల ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి నూతన మండల ఏర్పాటు కీలకంగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహా రెడ్డి, వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, చక్రపాణి, విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, శేఖర్ రెడ్డి, సదానంద రెడ్డి, మొగులయ్య, అంజనేయులు యాదవ్, వినోద్ గౌడ్, రమేష్, సత్యనారాయణ, ప్రకాష్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఐటీలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం

## లైంగిక వేధింపుల నివారణ, చట్టపరమైన పరిణామాలపై విద్యార్థులకు అవగాహన







గండిపేట(క్రైమ్ మిర్రర్): మహిళల భద్రత, లైంగిక వేధింపుల నివారణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు మహాత్మా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల మహిళా అభివృద్ధి కమిటీ (డబ్ల్యూడీసీ), అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) సంయుక్తంగా సాహస్ మాడ్యూల్, మహిళా భద్రతా విభాగం సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళా భద్రతా విభాగం న్యాయ సలహాదారు అడ్వకేట్ సూర్యకీర్తి డి.తో పాటు సీఐడీ మహిళా భద్రతా విభాగం సబ్ఇన్స్పెక్టర్ ఎం. సుధా మాధురి, పోలీస్ కానిస్టేబుల్ నితేష్ కుమార్ రాజ్‌దేవ్, సాహస్ మాడ్యూల్ న్యాయ సలహాదారులు అడ్వకేట్ పి. రచిత, అడ్వకేట్ గడప శ్రావణి వనరుల వ్యక్తులుగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల్లో మౌఖిక, మౌఖికేతర, శారీరక వేధింపుల వంటి వివిధ రూపాలను వాస్తవ సంఘటనలు, ఉదాహరణలతో వివరించారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించడం, వ్యక్తిగత హద్దులను గౌరవించడం, వేధింపులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, వాటికి పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. మహిళల పట్ల పరస్పర గౌరవం, బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించడంతో పాటు, విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులకు తావులేని సురక్షిత వాతావరణాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



## మణికొండలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

### మరిచెట్టు సర్కిల్‌లో పూల పండుగతో సందడి చేసిన మహిళలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండ డివిజన్ 127 పరిధిలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మణికొండలోని మరిచెట్టు సర్కిల్ వద్ద జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. పండుగ వాతావరణంతో మరిచెట్టు సర్కిల్ సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## శ్రమదానంతో ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టిన వాకర్స్

### పరిశుభ్రంగా పర్యావరణహితంగా చింతకుంట..



గండిపేట(క్రైమ్ మిర్రర్): అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని రాధాకృష్ణ నగర్, కాంతారెడ్డి నగర్ మధ్యల ఉన్న చింతకుంట పార్కులో శనివారం ఉదయం వాకర్స్ ప్లాస్టిక్ ఏరి వేత కార్యక్రమం జరిగింది. ఈ శ్రమదానంలో వాకర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని చింతకుంట లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. స్థానిక జిహెచ్ఎంసి పారిశుద్ధ సిబ్బంది వాకర్స్ కు సహకరించారు. ఒకప్పుడు మురికికుంటగా ఉండి ఇప్పుడు మంచి గుంట గా మారి వలస పక్షులకు ఆలవాలంగా నిలుస్తున్న చింతకుంటలో నీటిని సంరక్షించడానికి అందరూ కలిసి రావాలని వాకర్స్ పిలుపునిచ్చారు. చింతకుంటను పర్యావరణహితంగా అద్భుతమైన నేచురల్ పార్కుగా తీర్చిదిద్దడానికి అధికార యంత్రాంగం సహకరించాలని వాకర్స్ కోరారు.

## గండిపేటలో 'నో బిన్ -- నో ట్రేడ్'పై అవగాహన

గండిపేట(క్రైమ్ మిర్రర్): పరిసరాల పరిశుభ్రతను కాపాడుతూ, చెత్త నిర్వహణను మెరుగుపరిచే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ ఆధ్వర్యంలో 126వ వార్డు గండిపేట గ్రామంలో శనివారం వ్యాపారులకు 'నో బిన్ -- నో ట్రేడ్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్త సేకరణకు రెండు వేర్వేరు బిన్లు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. హానికర చెత్తను ఇతర వ్యర్థాలతో కలపకుండా ప్రత్యేకంగా వేరు చేసి నిర్వహించాలని తెలిపారు. చెత్తను మూలస్థాయిలోనే వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని, దుకాణాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని వ్యాపారులకు వివరించారు. పారిశుధ్య నిర్వహణలో వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, 'నో బిన్ -- నో ట్రేడ్' నిబంధనలను పాటించి చెత్త నిర్వహణలో సహకరించాలని నార్సింగి సర్కిల్ అధికారులు కోరారు.



## మణికొండలో అదనపు అంతస్తుల నిర్మాణంపై నోటీసులు

### చిత్రపురి కాలనీలో విల్లా నంబర్ 228పై అధికారుల స్పందన..

### సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన



గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ వస్తున్న ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు స్పందించారు. చిత్రపురి కాలనీలోని విల్లా నంబర్ 228 వద్ద స్టిల్ట్‌తో పాటు రెండు అదనపు అంతస్తులు నిర్మిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సంబంధిత యజమానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. కె. శ్రీనివాస్ తదితరులు చేసిన ఫిర్యాదు మేరకు నిర్మాణ స్థలాన్ని పరిశీలించినట్లు అధికారులు నోటీసులో పేర్కొన్నారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ఆమోదిత భవన నిర్మాణ ప్రణాళిక, ఇతర పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలపై వివరణ ఇవ్వడంతో పాటు, నిర్ణీత గడువులోగా సమాధానం సమర్పించాలని, ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు వ్యక్తిగత విచారణకు హాజరుకావాలని సూచించారు. వ్యవహారంపై నార్సింగి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారి పీఎస్ రమేష్ స్పందిస్తూ, సోమవారం నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనుమతులు, ఆమోదిత ప్లాన్‌కు అనుగుణంగానే భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉండటంతో, ఈ వ్యవహారంలో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## నారాయణ హైస్కూల్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ : నారాయణ హైస్కూల్ మిర్యాలగూడ లో బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ వేడుకల నేపథ్యంలో, పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి ముందస్తుగానే ఈ సంబురాలను జరుపుకున్నారు. బాలికలు ఉపాధ్యాయినిలు ఆనందోత్సాహాలతో ముందస్తు బతుకమ్మ సంబరాలలో బతుకమ్మ చుట్టూ నృత్యాలు కోలాటాలతో పాటలు పాడుతూ ఆనందంగా వేడుక చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిచ్చే పూవులను, తద్వారా ప్రకృతిని ఆరాధిస్తూ పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ అని ఇది తెలంగాణకే సొంతమైన ప్రత్యేక పండుగనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సైదిరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఒకే రంగు చీరలో.. ఐక్యత చాటిన ఆడబిడ్డలు.



క్రైమ్ మిర్రర్ "సంస్థాన్ నారాయణపురం :- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ కాలనీలో ఎంగిలిపూల బతుకమ్మ పండుగను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా కాలనీకి చెందిన ఆడబిడ్డలు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఒకే రంగు చీరలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 'అందరం సమానం.. మనమంతా ఒక్కటే' అనే సమానత్వ భావనను చాటుతూ మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సామూహికంగా నిర్వహిస్తూ పరస్పర ఆత్మీయతను చాటుకున్నారు. ఒకే రంగు చీరలతో మహిళలంతా కలిసికట్టుగా బతుకమ్మ ఆడటం కాలనీలో పండుగ వాతావరణాన్ని నింపింది. ఈ వేడుక మహిళల ఐక్యతకు, సమానత్వ భావనకు ప్రతీకగా నిలిచింది.



## గండిపేటలో హైడ్రా కొరడా

### నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి పరిరక్షణ



గండిపేట్,(క్రైమ్ మిర్రర్): నార్సింగి సర్కిల్ గండిపేట పరిధిలో ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారులు శనివారం ఉక్కుపాదం మోపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో గల సుమారు నాలుగు ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని ఓ గేటెడ్ కమ్యూనిటీ నిర్వాహకులు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో పాటు తమ ఆధీనంలో ఉంచుకున్నట్లు అందిన ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించారు. రంగంలోకి దిగిన హైడ్రా సిబ్బంది భారీ బందోబస్తు మధ్య ఆ భూమిని స్వాధీనం చేసుకుని, ఎలాంటి అన్యాక్రాంతాలు జరగకుండా పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్తులను, చెరువులు, కుంటలను మరియు ఖాళీ స్థలాలను కబ్జా కోరల నుండి రక్షించడమే ధ్యేయంగా హైడ్రా నిరంతరం చర్యలు చేపడుతోందని, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అధికారులు ఈ సందర్భంగా గట్టి హెచ్చరికలు జారీ చేశారు. హైడ్రా చేపట్టిన ఈ మెరుపు ఆపరేషన్‌తో కబ్జాదారుల్లో భయాందోళన వ్యక్తమవుతుండగా, స్థానిక ప్రజలు మరియు మేధావులు ప్రభుత్వ చర్యను స్వాగతిస్తున్నారు.

## మణికొండలో మహాలయ అమావాస్య అన్నప్రసాద సేవ

### మూడేళ్లుగా వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

గండిపేట(క్రైమ్ మిర్రర్): వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ మణికొండ ఆధ్వర్యంలో మహాలయ అమావాస్య సందర్భంగా శనివారం అన్నప్రసాద సేవ నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి తెలిపారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నప్రసాద సేవను నిరంతరంగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మణికొండ వాసులు కార్యక్రమానికి హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సమాజ సేవలో భాగంగా అన్నదాన కార్యక్రమాలను కొనసాగిస్తున్న వాసవి వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థానికులు అభినందించారు.



# శభాష్ నాంపల్లి సర్కిల్ పోలీస్!

## అంతర్ జిల్లా దొంగల ముఠా ఆటకట్టు..దొంగలపై మర్రిగూడ, చింతపల్లి పోలీసుల మెరుపు దెబ్బ!

## తొమ్మిది చోరీ కేసుల ఛేదన.. నలుగురు నిందితుల అరెస్ట్

## 21.05 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం.. పోలీసు బృందానికి డీఎస్పీ అభినందనలు



**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** ఆస్తుల రక్షణే లక్ష్యంగా.. దొంగలకు చెక్ పెట్టడమే ధ్యేయంగా, నాంపల్లి సర్కిల్ పోలీసులు మరోసారి తమ సత్తా చాటారు. జిల్లాలో వరుసగా పగటిపూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతూ, ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న అంతర్ జిల్లా దొంగల ముఠాకు మర్రిగూడ, చింతపల్లి పోలీసు బృందాలు విజయవంతంగా కళ్లెం వేశాయి. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టి, చాకచక్యంగా వ్యవహరించి నలుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు, వారి వద్ద నుంచి సుమారు 21 లక్షల 5 వేల విలువైన చోరీ సొత్తును, స్వాధీనం చేసుకోవడం పోలీసుల సమర్థతకు నిదర్శనంగా నిలిచింది. నేరాల నియంత్రణలో అప్రమత్తత, సమన్వయం, దర్యాప్తు నైపుణ్యాన్ని ప్రదర్శించిన, నాంపల్లి సర్కిల్ పోలీసుల పనితీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**పక్కా నిఘా.. వ్యూహాత్మక తనిఖీలు.. నేరగాళ్లకు చెక్!**

నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, జిల్లాలో ఆస్తి సంబంధిత నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు పరిధిలోని మర్రిగూడ, చింతపల్లి పోలీసులు నేరాల నియంత్రణపై దృష్టి సారించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల అప్రమత్తతతో ప్రారంభమైన ఈ తనిఖీలు చివరకు అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టురట్టుకు దారితీశాయి. మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు, చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరో కేసు దర్యాప్తులో నిందితులను విచారించగా, పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మర్రిగూడ, చింతపల్లి, గుర్రంపోడు, దేవరకొండ, కనగల్, నకిరేకల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన, తొమ్మిది చోరీ కేసులతో ఈ ముఠాకు సంబంధం ఉన్నట్లు, పోలీసుల విచారణలో వెల్లడైంది. వరుస చోరీలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నిందితులను గుర్తించి, అరెస్టు చేయడం ద్వారా పోలీసులు కీలక పురోగతి సాధించారు.

**తాళం వేసిన ఇళ్లే లక్ష్యం.. పగటిపూట చోరీలే పని!**

పోలీసుల విచారణ ప్రకారం నిందితులు, పగటిపూట తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా ఎంచుకొని చోరీలకు పాల్పడేవారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించి చొరబడి బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను అపహరించేవారని వెల్లడైంది. ఇలా ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, పలు మండలాలు, పట్టణాల పరిధిలో చోరీలకు పాల్పడుతూ, పోలీసులకు సవాల్‌గా మారినట్లు దర్యాప్తులో తేలింది. ఈ ముఠాలో ప్రధాన నిందితుడిగా గుర్తించిన వనపర్తి పట్టణానికి చెందిన, బొల్లెమోని అంజి అలియాస్ స్వామి గతంలోనూ పలు ప్రాంతాల్లో, చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మేస్త్రీ పనుల ద్వారా వచ్చే ఆదాయం తన ఖర్చులకు సరిపోవడం లేదనే కారణంతో, అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో తెలిపారు. ఈ క్రమంలో గతంలో పరిచయమైన వ్యక్తులతో కలిసి, చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో వనపర్తి, వనపర్తి గ్రామీణ ప్రాంతం, వీపనగండ్ల, పానగల్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, మిడ్జిల్, జడ్చర్ల, తిమ్మాజిపేట తదితర ప్రాంతాల్లో, చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లు ప్రధాన నిందితుడి విచారణలో వివరాలు వెలుగులోకి వచ్చాయి. జైలు సమయంలో పరిచయమైన ఇతర నిందితులతో కలిసి, తిరిగి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. నేరాలకు పాల్పడితే ఎప్పటికైనా చట్టం ముందు సమాధానం చెప్పాల్సిందేనని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.

**21 లక్షల సొత్తు స్వాధీనం.. బాధితులకు ఊరట!**

నిందితుల వద్ద నుంచి సుమారు 11 తులాల బంగారం, ఒకటిన్నర కిలోల వెండి, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు 21 లక్షలుగా అంచనా వేశారు. వరుస చోరీలతో నష్టపోయిన బాధితులకు నిందితుల అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం కొంత ఊరటనిచ్చే పరిణామంగా నిలిచింది. నేరగాళ్లు ఎంత చాకచక్యంగా వ్యవహరించినా, పోలీసుల నిఘా నుంచి తప్పించుకోవడం సులభం కాదని, ఈ కేసు ఛేదన నిరూపించింది. క్షేత్రస్థాయిలో తనిఖీలు, అనుమానితుల విచారణ, కేసుల మధ్య సంబంధాలను గుర్తించడం వంటి అంశాల్లో, పోలీసులు సమన్వయంతో పనిచేయడం ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. ముఖ్యంగా నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు ఆధ్వర్యంలో మర్రిగూడ, చింతపల్లి పోలీసు బృందాలు పరస్పర సహకారంతో, దర్యాప్తును ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.

**పోలీసుల పనితీరుకు డీఎస్పీ ప్రశంసలు**

ఈ సందర్భంగా దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు తమ ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బయటకు వెళ్లే సమయంలో ఇళ్ల తలుపులు, తాళాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. వీలైన చోట్ల నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు, కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన సిఐ రాజును, మర్రిగూడ ఎస్ఐ బి. రాంబాబు, చింతపల్లి ఎస్ఐ ఎం. రామ్మూర్తితో పాటు పోలీసు సిబ్బంది కిషన్, శరణ్, వేణుగోపాల్, అనిల్, యాదగిరి, యాదయ్యలను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు బృందానికి రివార్డులు అందించి వారి సేవలను ప్రశంసించారు.

**ప్రజల భద్రతే లక్ష్యం.. నేరగాళ్లపై నిరంతర నిఘా!**

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంలో పోలీసులు చూపుతున్న చొరవకు ఈ ఘటన అద్దం పడుతోంది. వరుస చోరీలతో ప్రజల్లో నెలకొన్న ఆందోళనను తగ్గించే దిశగా నాంపల్లి సర్కిల్ పోలీసుల సమన్వయ చర్యలు ప్రశంసనీయం. నేరగాళ్ల కదలికలను ముందుగానే గుర్తించి, ఆధారాలను సేకరించి, చట్టపరంగా చర్యలు తీసుకోవడంలో పోలీసులు చూపిన చురుకుదనం అభినందించదగినది.

# సామా రామ్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వాసిరెడ్డి నరేష్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామా రామ్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ (మీడియా అండ్ కమ్యూనికేషన్స్) వాసిరెడ్డి నరేష్ కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామా రామ్మోహన్ రెడ్డి నివాసంలో ఆయనతో ఆత్మీయంగా ముచ్చటించారు. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ భేటీ ఆత్మీయంగా సాగింది. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి నరేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బండ్లగూడ జాగీర్‌కు చెందిన వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు చేసిన పోలీసులు



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ జాగీర్‌లో నివసిస్తున్న ఓ భవన నిర్మాణ కార్మికుడు అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యాభై ఆరేళ్ల సహదేబ్ లైయా, బండ్లగూడ జాగీర్ పరిధిలోని త్రమా మాల్ నిర్మాణ స్థలంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, అతను ఇటీవల నివాసం నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ పదకొండు వందల తొంభై తొమ్మిది/రెండు వేల ఇరవై ఆరు కింద మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు వెంటనే రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

# జర్నలిస్టు వెంకన్న మాతృమూర్తి రామలమ్మకు ప్రముఖుల నివాళి



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 10: ఆంధ్రప్రభ మిర్యాలగూడ డివిజన్ రిపోర్టర్ గుండెపూరి వెంకన్న మాతృమూర్తి గుండెపూరి రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు శనివారం త్రిపురారం మండలం అంజనపల్లిలోని ఆమె స్వగ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. రాములమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరు బాలకృష్ణ, దేశిడి శేఖర్ రెడ్డి, జవహర్, కె. ఇంద్రకుమార్, తలకొప్పుల సైదులు, ప్రభాకర్ రెడ్డి, మంద సైదులు, బీఆర్ఎస్ నాయకులు బి. రాంబాబు, తిరందాసు విష్ణు, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, జర్నలిస్టులు రాములమ్మకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికుల నిరసన

## సూపర్‌వైజర్ వేధింపులు, అక్రమ వసూళ్లపై ఆరోపణలు

## శ్రీనివాస్‌ను వేరే విభాగానికి బదిలీ చేయాలని డిమాండ్





**రామకృష్ణాపూర్, అక్టోబరు 10 (క్రైమ్ మిర్రర్):** మున్సిపల్ పారిశుధ్య విభాగం సూపర్‌వైజర్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ పారిశుధ్య కార్మికులు, వాహన డ్రైవర్లు శనివారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సూపర్‌వైజర్‌ను ప్రస్తుత బాధ్యతల నుంచి తప్పించి వేరే విభాగానికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై గాయపడిన కార్మికుల పట్ల సూపర్‌వైజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్మికులు ఆరోపించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు చొరవ చూపడం లేదని, గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న కార్మికుడి విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రశ్నిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహన డ్రైవర్ల నుంచి రోజూ రెండు లీటర్ల చొప్పున పెట్రోల్ ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహిళా కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికి వెళ్లేందుకు అనుమతి కోరినా దురుసుగా మాట్లాడుతున్నారని, విధుల్లో చిన్నపాటి పొరపాట్లు జరిగినా అవమానకరంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. సూపర్‌వైజర్ వ్యవహారశైలిపై గతంలో కమిషనర్, ఇన్‌స్పెక్టర్, చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని కార్మికులు తెలిపారు. శ్రీనివాస్‌ను వేరే విభాగానికి బదిలీ చేసే వరకు విధుల్లో చేరబోమని స్పష్టం చేశారు.

**ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**

కార్మికుల నిరసనపై మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ స్పందించారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్మికుల ఫిర్యాదుల నేపథ్యంలో ఇప్పటికే సూపర్‌వైజర్ శ్రీనివాస్‌ను పిలిచి మందలించినట్లు తెలిపారు. కార్మికులు చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సంబంధిత సిబ్బందిని వేరే విభాగానికి బదిలీ చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేదని కమిషనర్ తెలిపారు. ప్రతి నెలా ఒకటి, రెండు తేదీల్లోనే వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పండుగ సమయంలో పారిశుధ్య పనులకు అంతరాయం కలగకుండా కార్మికులు తిరిగి విధులకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.



# పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి

## ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలి

## మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ రవి

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, అక్టోబరు 10:** కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, పెండింగ్ లేకుండా చూడాలని మిర్యాలగూడ డీఎస్పీ జి. రవి పోలీసు సిబ్బందికి సూచించారు. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, కేసుల పురోగతిపై ఆరా తీశారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ కేసులను సమర్థవంతంగా, సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు కవాతును పరిశీలించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ లక్ష్మయ్య పాల్గొన్నారు.

# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

తెలంగాణ జిల్లాలు

10 ఆదివారం 11-10-2026


# రావిర్యాలలో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు...!

**శ్రీ లక్ష్మీనరసింహస్వామి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేదిక..**

**ఉత్సాహంగా, ఊరేగింపుగా వెళ్ళి పెద్ద చెరువులో నిమజ్జనం చేసిన గ్రామ ఆడపడుచులు**





**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం నియోజకవర్గం, శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని రావిర్యాల గ్రామంలో శనివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. శ్రీ లక్ష్మీనరసింహస్వామి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామంలోని ఆడపడుచులు, మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచే మహిళలు ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. గ్రామంలోని శ్రీ ఓంకారేశ్వర ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేదికలో, ముత్యాలమ్మ దేవాలయం వద్ద ఒకచోట చేరిన మహిళలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. పూల పరిమళాలు, మహిళల కోలాహలంతో దేవాలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మహిళల ఐక్యతకు ఈ వేడుక నిదర్శనంగా నిలిచింది.

అనంతరం మహిళలంతా కలిసి మేళతాళాలతో రావిర్యాల పెద్ద చెరువు వరకు ఊరేగింపుగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగను ఇలా సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాలన్నదే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా శంషాబాద్ జీహెచ్ఎంసీ అధికారులు ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. గ్రామంలో బతుకమ్మ సంబరాలు ఆనందాన్ని నింపాయని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## హాల్మార్క్ ఎంపీరియన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పుప్పలగూడలోని హాల్మార్క్ ఎంపీరియన్ గేటెడ్ కమ్యూనిటీలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. పూల పండుగ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తరారి మల్లేశ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, రామకృష్ణారెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పూల సోయగాలు, మహిళల సందడి మధ్య సాగిన బతుకమ్మ వేడుకలు గేటెడ్ కమ్యూనిటీలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

## కత్తితో బెదిరించి దోపిడీ.. నిందితుడి అరెస్ట్

**రెడ్‌మీ ఫోన్, హోండా డియో స్కూటర్, కత్తి స్వాధీనం**






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ దోపిడీకి పాల్పడిన కేసులో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఒక నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి రెడ్‌మీ సెల్‌ఫోన్, హోండా డియో స్కూటర్, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న రాత్రి 8 గంటల సమయంలో ఫిర్యాదుదారుడు ఎస్కే అయాన్ తన స్నేహితుడు ఉమైర్‌తో కలిసి షైన్ మోటార్‌సైకిల్‌పై ఆరాంఘర్‌కు వచ్చారు. ఎంఎస్ కాలేజీ సమీపంలో బైక్‌ను పార్క్ చేసి, రైల్వే ట్రాక్ సమీపంలోని ఖాళీ ప్రదేశానికి వెళ్లారు. అక్కడికి వచ్చిన సుమారు 20--25 ఏళ్ల వయస్సున్న వ్యక్తి కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయాన్ ఫోన్ ఇచ్చేందుకు నిరాకరించడంతో కత్తితో దాడి చేసి, ఎడమ భుజం, పొట్ట భాగాల్లో గాయపరిచాడు. అనంతరం అతడి మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని బుద్వేల్ రైల్వే స్టేషన్ వైపు పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించారు. ఈ నెల 9న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని సయ్యద్ జహీర్ (25)గా గుర్తించారు. ఇతను హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్, ఎన్ఎం గూడ ప్రాంతానికి చెందినవాడని, సేల్స్ బాయ్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి ఒక రెడ్‌మీ సెల్‌ఫోన్, టీజీ 12 ఏ 0402 నంబర్ గల హోండా డియో స్కూటర్, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ ఏ. సుధాకర్ పర్యవేక్షణలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ సి. శ్రీనివాస్, డీఐ ఎండీ. మక్సూద్ అలీ, ఎస్ఐ రామభూపాల రెడ్డి, క్రైమ్ సిబ్బంది ఈ కేసు దర్యాప్తులో పాల్గొని నిందితుడిని పట్టుకున్నట్లు డీసీపీ తెలిపారు.

## పోచమ్మ ఆలయంలో 36 నెలలుగా నిరంతర అన్నదాన సేవ



**ప్రతి అమావాస్యకు అన్నప్రసాద వితరణ..**

**దేవీ నవరాత్రులకు ప్రత్యేక ఏర్పాట్లు**

**కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్**

గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ బాబుల్ రెడ్డి నగర్‌లో కొలువుదీరిన శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. భక్తుల సహకారంతో గత 36 నెలలుగా ప్రతి అమావాస్య రోజున ఎలాంటి విరామం లేకుండా అన్నదాన సేవ నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి అమావాస్య రోజున ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్నారు. స్థానిక భక్తులతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవా కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి అన్నప్రసాదం అందేలా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ, భక్తుల సహకారం, అమ్మవారి దయతోనే 36 నెలలుగా నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. శ్రీ పోచమ్మ అమ్మవారు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలతో అన్నదానాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

**దేవీ నవరాత్రులకు ప్రత్యేక పూజలు...**

రాబోయే దేవీ నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, కిష్టప్ప, బి. వెంకటేష్, కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షుడు ఉప్పల్ శ్రీను, ఆలయ కమిటీ అధ్యక్షుడు సంట్రింగ్ శంకర్, మల్లేష్, కృష్ణ, బొంబాయి రవి, బుచ్చయ్య, కార్తీక్, ఆనంద్, భాగ్యమ్మ, కుమార్, జగన్, శేఖర్, లక్ష్మణ్, మధు చారి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రముఖులు, మహిళలు, భక్తులు అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.






## హైదర్గూడా పెద్ద తాళ్లకుంట్ల చెరువు వద్ద ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

**రంగురంగుల పూల బతుకమ్మలతో సందడి..**

**మహిళల ఆటపాటలు**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని హైదర్గూడాలోని పెద్ద తాళ్లకుంట్ల చెరువు వద్ద మహిళలు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో పండుగ సందడిని నింపుతున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకుంటున్నారు. బతుకమ్మ సంబరాల నేపథ్యంలో చెరువు వద్ద అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా ప్రాంగణంలో తగినంత వెలుతురు కోసం లైట్లు ఏర్పాటు చేశారు. బతుకమ్మల నిమజ్జనం కోసం ప్రత్యేక ప్రాంతాన్ని సిద్ధం చేసి, అవసరమైన సదుపాయాలు కల్పించారు. పండుగకు వచ్చే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. సంప్రదాయబద్ధంగా సద్దుల బతుకమ్మను నిర్వహించుకుంటూ మహిళలు పండుగ సంబరాల్లో మునిగిపోయారు.

## వెంకటేశ్వర కాలనీ, ఎంజీ పార్క్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు





గండిపేట(క్రైమ్ మిర్రర్): వెంకటేశ్వర కాలనీ, ఎంజీ పార్క్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, నెక్నాంపూర్ డివిజన్ అధ్యక్షుడు మెరుగు జితేందర్, తాజ్ భాయ్ తదితరులు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాటలు, ఆటలతో సందడిగా సాగిన బతుకమ్మ వేడుకలు స్థానికంగా పండుగ వాతావరణాన్ని నింపాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.